ఈనాటి
# తెలుగోడు
PRGI-NO-APTEL/25/A2739
EENAATI TELUGODU... Telugu Daily
https://www.eenaatitelugodu.com




సంపుటి-1 | సంచిక - 140 | బుధవారం 18 ఫిబ్రవరి 2026 | పేజీలు -8 | వెల - రూ.. 5

Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati

## పెళ్లికి ముందే శారీరక సంబంధాలు సరికాదు

**వ్యక్తి గురించి తెలుసుకోకుండా మోసపోతే ఎలా**
**కేసు విచారణ సందర్భంగా సుప్రీం హితోక్తులు**



**న్యూ ఢిల్లీ (తెలుగోడు), ఫిబ్రవరి 17 :**

నేటి కాలంలో సోషల్ మీడియా, మ్యాట్రిమోనీ సైట్ల ద్వారా పరిచయాలు పెరిగి మోసపోతున్న ఘటనలు ఎక్కువవుతున్న నేపథ్యంలో అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. (మిగతా 2లో)

## చేతిలో నగదు రికార్డు లావాదేవీల్లో డిజిటల్ దూకుడు



**న్యూ ఢిల్లీ (తెలుగోడు), ఫిబ్రవరి 17 :**

భారత ఆర్థిక వ్యవస్థలో ఒక వింత పరిస్థితి స్పష్టమవుతోంది. దేశవ్యాప్తంగా ప్రజల చేతుల్లో, బ్యాంకుల వద్ద చలామణిలో ఉన్న నగదు ఈ ఏడాది జనవరి నాటికి రికార్డు స్థాయిలో 40 లక్షల కోట్ల రూపాయలకు చేరుకుంది. ఇది గత ఏడాదితో పోలిస్తే సుమారు 11.1 శాతం అధికం. (మిగతా 2లో)



## బలపడిన భారత్-ఫ్రాన్స్ మైత్రి

- భారత్-ఫ్రాన్స్ వ్యూహాత్మక భాగస్వామ్యం..
- ఎయిర్‌బస్ హెచ్-125 హెలీకాప్టర్ అసెంబ్లీ లేన్ ప్రారంభం..
- ఎవరెస్టు ఎత్తు చేరగల హెచ్-125 హెలీకాప్టర్‌లు భారత్‌లో తయారీ..
- భవిష్యత్తులో ప్రపంచ దేశాలకు ఎగుమతి..
- ముంబైలోని లోక్ భవన్‌లో ద్వైపాక్షిక సమావేశం..
- ఐరోపా కూటమితో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం..
- ఇరు దేశాల రక్షణ రంగ సహకార దిశగా ప్రధాని మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ చర్చలు...

**ముంబై (తెలుగోడు), ఫిబ్రవరి 17 :**

భారత్-ఫ్రాన్స్ మధ్య మైత్రీ, వ్యూహాత్మక భాగస్వామ్యానికి మరో కొత్త మైలురాయి చేరింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయెల్ మెక్రాన్ కర్ణాటకలోని వేమగల్‌లో ఎయిర్‌బస్ హెచ్-125 హెలికాప్టర్ అసెంబ్లీ లైన్‌ను ప్రారంభించారు. ప్రధానమంత్రి వర్చువల్ విధానంలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. భారత్‌లో ఫ్రాన్స్ సహకారంతో ఎవరెస్ట్ ఎత్తు చేరగలిగే హెలికాప్టర్లు తయారవుతున్నాయని, భవిష్యత్తులో ఈ హెలికాప్టర్లను ప్రపంచ దేశాలకు ఎగుమతి చేయనున్నట్లు మోదీ తెలిపారు. ఈ కార్యక్రమం భారత-ఫ్రాన్స్ మధ్య వ్యూహాత్మక, రక్షణ, ఆర్థిక, అంతర్జాతీయ రంగాల్లో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రధానమైన ఘట్టంగా ఉంటుంది. వేమగల్‌లో ప్రారంభమైన అసెంబ్లీ లైన్, భారతీయ ఎయిర్‌క్రాఫ్ట్ పరిశ్రమకు కొత్త ప్రాణాన్ని తీసుకురావడమే కాక, విదేశీ ఎగుమతులకు కేంద్రంగా భారత్‌ను నిలబెడుతుంది. ముంబైలోని లోక్‌భవన్ లో ద్విపాక్షిక సమావేశంలో, మోదీ-మెక్రాన్ ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక, రక్షణ, వాణిజ్య, ఆర్థిక అంశాలపై లోతైన చర్చలు జరిపారు. ప్రధానమంత్రి మోదీ ఈ సందర్భంలో, భారత-ఫ్రాన్స్ భాగస్వామ్యాన్ని ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యంగా మార్చేందుకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. రఫేల్ జెట్‌ల నుంచి ఎవరెస్ట్ ఎత్తు చేరగలిగే హెలికాప్టర్ల వరకు 2లో

## మండలిలోనూ డిజిటల్ హాజరు నమోదు అమలు చేయండి



**కల్తీ నెయ్యి వ్యవహారంలో ఇంకా అబద్ధాల ప్రచారమేనా**
**మీడియా పాయింట్ వద్ద విపక్షనేత బొత్స ఆగ్రహం**

**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 17 :**

శాసనసభలో డిజిటల్ అటెండెన్స్ వ్యవస్థను అమలు చేసిన ప్రభుత్వం, అదే విధానాన్ని శాసనమండలిలో ఎందుకు అమలు చేయడంలేదని విపక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. మండలి మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ ఈ అంశంపై (మిగతా 2లో)

## కేసులు పెట్టినా, జైళ్లకు పంపినా తగ్గేదేలే!



**అంబటి ఇంటిపై దాడి రాజకీయ కక్షే.. రాష్ట్రంలో రాజ్యాంగం ఎక్కడా..!**
**బాధితులను జైల్లోపెట్టి నిందితులను బైట వుంచడం దారుణం..**
**రాష్ట్ర చరిత్రలోనే అత్యంత దారుణమైన బడ్జెట్.. గుడివాడ అమర్నాథ్..**

**తూర్పుగోదావరి (తెలుగోడు), ఫిబ్రవరి 17 :**

అంబటి ఇంటిపై జరిగిన దాడి పూర్తిగా రాజకీయ కక్షపూరిత చర్య అని రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరుగుతోందని గుడివాడ అమర్నాథ్ పేర్కొన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడిన ఆయన, రాంబాబును హతమార్చాలనే ఉద్దేశంతో దాడి జరిగిందని ఆరోపించారు. ఈ ఘటనలో బాధితులనే జైల్లో పెట్టి, దాడికి పాల్పడినవారు, ప్రేరేపించినవారు స్వేచ్ఛగా తిరుగుతుండటం రాష్ట్రంలో రాజ్యాంగ వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తుతోందన్నారు. ఇది న్యాయపాలనకు (మిగతా 2లో)

## చవక ప్రయాణానికి ఆంధ్ర యాత్రి




- రాష్ట్రంలో రవాణా రంగానికి కొత్త దిశ
- డ్రైవర్లకు అధిక ఆదాయం కల్పించే విధానం..
- ఒక్కో ప్రయాణానికి నామమాత్రపు చార్జీలు..
- తొలిదశలో విజయవాడ, తిరుపతిలో ప్రారంభం..
- రియల్ టైం ట్రాకింగ్‌తో భద్రతా సదుపాయాలు..
- తక్కువ రుసుముతో పారదర్శకవ్యవస్థ ఏర్పాటు..
- ప్రైవేట్ యాప్‌లకు ప్రత్యామ్నాయంగా సేవలు...

**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 17 :**

రాష్ట్ర ప్రభుత్వం రవాణా రంగంలో మరో కీలక అడుగు వేసింది. దేశవ్యాప్తంగా ప్రైవేట్ యాప్‌లు ఆటో, క్యాబ్ సేవలను అందిస్తూ ప్రతి ప్రయాణంపై భారీ కమిషన్ వసూలు చేస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు చవకగా, డ్రైవర్లకు లాభదాయకంగా ఉండే విధంగా 'ఆంధ్రా యాత్రి' పేరుతో సొంత ప్రయాణ సేవా యాప్‌ను తీసుకొస్తోంది. ప్రజలకు సులభంగా వాహన సదుపాయం అందించడమే కాకుండా పారదర్శక వ్యవస్థను నెలకొల్పడం ఈ యోజన ప్రధాన లక్ష్యంగా ఉంది. ప్రస్తుతం ప్రైవేట్ సంస్థలు ఒక్కో ప్రయాణంపై ఇరవై శాతం వరకు కమిషన్ తీసుకుంటున్నాయి. దీనివల్ల డ్రైవర్లకు ఆదాయం తగ్గిపోతోంది. ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రభుత్వం నామమాత్రపు రుసుముతో సేవలు అందించాలనే నిర్ణయం తీసుకుంది. ఒక్కో ప్రయాణానికి (మిగతా 2లో)

## మదనపల్లిని కుదిపేసిన బాలిక హత్య



- సంచలనం రేపిన మదనపల్లి ఘటన..
- బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడిన హోంమంత్రి..
- కారకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక..

**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 17 :**

మదనపల్లిలో జరిగిన దారుణ ఘటనపై హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రంగా స్పందించారు. ఈ ఘటన చాలా బాధాకరమని పేర్కొంటూ, బాధితురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడినట్లు వెల్లడించారు. ఘటనకు సంబంధించి ముందుగా ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సోషల్ మీడియాలో తనను ట్యాగ్ చేశారని అనిత తెలిపారు. అనంతరం సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నట్లు చెప్పారు. ప్రాథమిక విచారణలో ముద్దాయి డ్రగ్స్ లేదా గంజాయి సేవించలేదని, అయితే మితిమీరిన మద్యం సేవించినట్లు గుర్తించామని వెల్లడించారు. మొదట బాలిక అదృశ్యమై ఉండవచ్చని అనుకున్నామని, కానీ స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు విచారణ చేపట్టి బాలిక మృతదేహాన్ని ఆమె ఇంటి ఎదురుగా గుర్తించారని తెలిపారు. నిందితుడిని తమకు అప్పగించాలని స్థానికులు ఆందోళనకు దిగారని హోంమంత్రి చెప్పారు. అయితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉండటంతో, విచారణకు ఆటంకం కలగకుండా (మిగతా 2లో)

## శ్రీలక్ష్మికి చుక్కెదురు

- విచారణ కొనసాగాలని స్పష్టం చేసిన సుప్రీం..
- గత నిలుపుదల ఉత్తర్వులపై కీలక వ్యాఖ్యలు..
- అక్రమాస్తుల అంశం మళ్లీ చర్చకు..
- దిగువ కోర్టుల్లో విచారణ వేగవంతానికి ఆదేశం..




**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 17 :**

ఓబుళాపురం అక్రమ గనుల కేసులో సీనియర్ ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మికి దేశ అత్యున్నత న్యాయస్థానంలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసు నుంచి తనను విముక్తి చేయాలని కోరుతూ ఆమె దాఖలు చేసిన విజ్ఞప్తిని న్యాయస్థానం తిరస్కరించింది. దీంతో ఆమెపై నమోదైన అభియోగాలపై విచారణ కొనసాగాల్సిందేనని స్పష్టమైంది. న్యాయమూర్తి ఎం.ఎం. సుందరేష్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ అంశంపై కీలక వ్యాఖ్యలు చేసింది. గతంలో వేరే కేసుగా భావించి నిలుపుదల ఉత్తర్వులు ఇచ్చామని, ఇప్పుడు ఆ పొరపాటును సవరించుకుంటున్నామని పేర్కొంది. తమ పొరపాటు వల్ల వచ్చిన నిలుపుదల ఉత్తర్వులను నిందితులు ఇన్నాళ్లూ అనుభవించారని ధర్మాసనం వ్యాఖ్యానించింది. వెంటనే దిగువ న్యాయస్థానంలో విచారణను వేగవంతం చేయాలని ఆదేశించింది. గాలి జనార్దన్ రెడ్డికి చెందిన ఓబుళాపురం గనుల సంస్థకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకున్నారన్న ఆరోపణలతో కేంద్ర దర్యాప్తు సంస్థ శ్రీలక్ష్మిని నిందితురాలిగా చేర్చింది. గతంలో తెలంగాణ ఉన్నత న్యాయస్థానం ఆమె విజ్ఞప్తిని కొట్టివేయగా, ఆ నిర్ణయాన్ని సవాలు చేస్తూ ఆమె దేశ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అయితే దర్యాప్తు సంస్థ సమర్పించిన ఆధారాలను పరిశీలించిన అనంతరం ఆమెపై ఉన్న అభియోగాలను పూర్తిగా విచారించాల్సిందేనని స్పష్టం చేసింది. దర్యాప్తు సంస్థ వాదనల ప్రకారం, గనుల (మిగతా 2లో)

## బిల్‌గేట్స్ పర్యటన పైనా వైకాపా అక్కసు




**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 17 :**

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ మంత్రులు కొలుసు పార్థసారథి, అనగాని సత్యప్రసాద్‌లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి వేదికగా మీడియాతో మాట్లాడారు. జగన్ రెడ్డి అభివృద్ధి వ్యతిరేకి అని మరోసారి నిరూపితమైందని విమర్శించారు. బిల్‌గేట్స్ అమరావతి పర్యటనపై జగన్ విషం కక్కుతున్నారని ధ్వజమెత్తారు. జగన్ ఐదేళ్ల పాలన విధ్వంసానికి సంకేతమని ఎద్దేవా చేశారు. కూటమి పాలన కన్‌స్ట్రక్షన్‌కు నిదర్శనమని ఉద్ఘాటించారు. కూల్చివేతల ఆలోచన ఉన్న జగన్ రెడ్డి.. అమరావతి నిర్మాణం జరుగుతుంటే ఓర్చుకోలేకపోతున్నారని మంత్రి పార్థసారథి ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌ను బిల్‌గేట్స్ పొగడటంతో జగన్, సాక్షి మీడియా విష ప్రచారానికి పూనుకున్నారని ఫైర్ అయ్యారు. ఏపీ బాగుపడటం జగన్‌కు ఏమాత్రం ఇష్టం లేదని.. అందుకే తన అనుచరులతో బిల్స్‌గేట్స్ పర్యటనపై బురద చల్లిస్తున్నారని మండిపడ్డారు. ఎవరు ఎన్ని దుష్ప్రచారాలు చేసినా.. అభివృద్ధిలో వెనకడుగు వేసే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. జగన్ రెడ్డి అండ్ కోకి ప్రజలే తగినవిధంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. బిల్ గేట్స్ పర్యటనపై జగన్ మీడియా విష ప్రచారం చేస్తోందని ఏపీ రెవెన్యూ, రిజిస్ట్రేషన్, (మిగతా 2లో)

## కృత్రిమ మేధ కళ్లద్దాలతో మోడీ



**ముంబై (తెలుగోడు), ఫిబ్రవరి 17 :**

భారత్ ఆతిథ్యమిస్తున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పో-2026, సమిట్ ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఈ సదస్సు జరుగుతోన్న వేళ మన స్టార్టప్ 'సర్వం ఏఐ' చేసిన ప్రకటన వార్తల్లో నిలిచింది. త్వరలో ఏఐ స్మార్ట్ గ్లాసెస్ తీసుకువస్తామని వెల్లడించింది. ఆ అద్దాలు ధరించిన ప్రధాని మోదీ ఫొటో ఇప్పుడు నెట్టింట్లో వైరల్‌గా మారింది. కాగా...కృత్రిమ మేధ రంగంపై విస్తృతంగా చర్చించేందుకు, అత్యాధునిక ఆవిష్కరణలపై అవగాహన కల్పించే లక్ష్యంతో భారత్‌లో ఏఐ సమిట్ జరుగుతోంది. ఏఐ ప్రయాణంలో భారత్ ముందు వరుసలో నిలిచిందని, దాని పురోగతి.. లక్ష్యం, బాధ్యతలను ప్రతిబింబిస్తుందని ఇప్పటికే మోదీ పేర్కొన్న సంగతి తెలిసిందే. బెంగళూరు కేంద్రంగా 2023లో వివేక్ రాఘవన్, ప్రత్యూష్ కుమార్ ఈ సర్వం ఏఐని స్థాపించారు. గ్లాసెస్ గురించి ప్రత్యూష్ ఒక వీడియోను (మిగతా 2లో)

# బలపడిన భారత్-ఫ్రాన్స్ మైత్రి



(మొదటి పేజి (తరువాయి)

రక్షణ సహకారం విస్తరించనుందని, లోతైన సముద్రాల పరిశీలన, సైనిక డ్రోన్ల ఆపరేషన్లకు భాగస్వామ్యం ఉపయోగపడుతుందని చెప్పారు.ప్రధాని మోదీ ఈ కార్యక్రమంలో హెలికాప్టర్ల భవిష్యత్తు ఉత్పత్తి, ఎగుమతులపై ధీమా వ్యక్తం చేశారు. ఫ్రాన్స్ సహకారంతో తయారు అయ్యే హెచ్-125 హెలికాప్టర్లు భారత్ నుండి ప్రపంచ వ్యాప్తంగా సరఫరా చేయబడతాయి. ఇది దేశంలో డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్, ఉత్పత్తి, ఎగుమతి రంగాలకు కొత్త అవకాశాలను సృష్టిస్తుంది. స్థానికంగా తయారు చేయబడిన పరికరాలు, భాగాలు మాకు వర్క్ ఫోర్స్‌కు కొత్త ఉద్యోగ అవకాశాలు కలిగిస్తాయి. పరిశ్రమలో =డణ, నూతన సాంకేతికతలు, నౌకాశ్రయ ఉత్పత్తి విస్తరిస్తాయి, భారతీయ ఎయిర్‌క్రాఫ్ట్ పరిశ్రమను అంతర్జాతీయ స్థాయిలో మరింత బలపరుస్తాయి.భారత-ఫ్రాన్స్ భాగస్వామ్యం రక్షణ, వ్యూహాత్మక, అంతర్జాతీయ, ఆర్థిక మరియు వ్యాపార రంగాల్లో విస్తృత ప్రభావం చూపుతుంది. రఫేల్ జెట్‌లు, సబ్‌మెరైన్‌లు, హెచ్-125 హెలికాప్టర్లు మొదలైనవి రక్షణ సహకారాన్ని మరింత బలపరుస్తాయి. ఉగ్రవాద వ్యతిరేక పోరులో భాగస్వామ్యం సమర్థవంతం అవుతుంది. ప్రపంచ వ్యాప్తంగా సైనిక సహకారం, వ్యూహాత్మక సమాచార మార్పిడి మరింత విస్తరిస్తుంది.

ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ భారత్‌ను అత్యంత విశ్వసనీయ భాగస్వామి అని గుర్తించారు. చట్టబద్ధ పాలన, వ్యూహాత్మక నిర్ణయాలు, అంతర్జాతీయ సుస్థిరత సాధనలో ఇరుదేశాలు ఒకరిపై ఒకరు ఆధారపడతాయని, ఉగ్రవాద వ్యతిరేక పోరులో భారత్‌కు పూర్తి సహకారం అందిస్తారని తెలిపారు. ఇటీవల ఐరోపా కూటమితో చారిత్రక స్వేచ్ఛా వాణిజ్యం ఒప్పందం కుదుర్చబడింది.భవిష్యత్తులో ఈ భాగస్వామ్యం రక్షణ, వ్యాపారం, వ్యూహాత్మక రంగాల్లో మరింత బలపడనుందని మోదీ-మెక్రాన్ స్పష్టం చేశారు. భారత్‌లో తయారు అయ్యే హెచ్-125 హెలికాప్టర్లు, రక్షణ మరియు వాణిజ్య రంగాల్లో ఇరుదేశాల భాగస్వామ్యానికి గట్టి ఆధారం అవుతాయని అధికారులు తెలిపారు. భారత-ఫ్రాన్స్ మైత్రీ దేశాల భద్రత, ఆర్థిక అభివృద్ధికి కీలకంగా మారతుందని పత్రికలో వివరించారు.

# డిజిటల్ హాజరు నమోదు అమలు చేయండి

(మొదటి పేజి (తరువాయి)

ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇక, దేవదేవుడి ప్రసాదంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనవసర ఆరోపణలు చేశారని బొత్స ఆరోపించారు. పందికొవ్వు, జంతువుల కొవ్వు కలిపారని ప్రచారం చేయడం బాధాకరమన్నారు. వాస్తవాలు తేలాలని సుప్రీంకోర్టు సిట్ నియమించిందని, దర్యాప్తులో కొన్ని ఆశ్చర్యకర విషయాలు బయటకు వస్తున్నాయని చెప్పారు. ప్రజలు జీర్ణించుకోలేని నిజాలు వెలుగులోకి వస్తున్నాయని వ్యాఖ్యానించారు.కల్తీ నెయ్యి సరఫరా చేస్తున్నారనే కారణంతో ఇందాపూర్‌ను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టారని, ఇప్పుడు అదే సంస్థ రూ.680కు నెయ్యి సరఫరా చేస్తోందని తెలిపారు. ఇందాపూర్ సంస్థకు హెరిటేజ్ ఫుడ్స్ సంబంధం ఉందని, ఇవన్నీ తాము సృష్టించిన ఆరోపణలు కాదని ? సంబంధిత సంస్థలే వెల్లడించాయని అన్నారు. ఇందాపూర్‌ను అడ్డుపెట్టుకుని హెరిటేజ్ దోపిడీకి ఎ÷-లాన్ చేసిందని, దేవుడి పేరుతో రాజకీయ లబ్ధి పొందాలనే ప్రయత్నం చేశారని ఆరోపించారు. సభలో ఇందాపూర్ అంశంపై చర్చకు ఎందుకు అనుమతించలేదని ప్రశ్నించారు. టాయిలెట్లలో వాడే కెమికల్స్ లడ్డూలో కలిపారని సీఎం మాట్లాడటం దురదృష్టకరమన్నారు. చంద్రబాబు అధికార దాహంతో ఏ స్థాయికైనా వెళ్తారని విమర్శించారు. ఆయన దోపిడీపై ఎంతవరకైనా పోరాడుతామని స్పష్టం చేశారు.ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో బిల్ గేట్స్ పేరు కేంద్రం తొలగించిందనే వార్తలపై రెండు మూడు రోజుల్లో స్పష్టత వస్తుందని, ఆ తర్వాత స్పందిస్తామని తెలిపారు. ఒకవేళ కేంద్రం ఆయన పేరును పక్కన పెట్టి ఉంటే, అదే సమయంలో ఏపీకి ఆహ్వానించడం సబబు కాదన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఇంటింటికీ వైద్యం అందించామని, ఈ ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. చట్టాన్ని, రాజ్యాంగాన్ని గౌరవిస్తామని, రాజ్యాంగబద్ధమైన చర్యలు తీసుకోవాలంటే తీసుకోవచ్చని పేర్కొన్నారు. మొత్తానికి, అసెంబ్లీలో అమలు చేస్తున్న డిజిటల్ అటెండెన్స్ విధానాన్ని మండలిలో కూడా అమలు చేయాలని బొత్స సత్యనారాయణ గట్టిగా డిమాండ్ చేశారు.

# చవక ప్రయాణానికి ఆంధ్ర యాత్రి

(మొదటి పేజి (తరువాయి)

కారుకు పదకొండు రూపాయలు, ఆటోకు ఐదు రూపాయలు, బైక్‌కు మూడు రూపాయలు మాత్రమే వసూలు చేయనున్నారు. అంతేకాకుండా రోజుకు ముప్పై నుంచి యాభై రూపాయలు చెల్లిస్తే అపరిమిత ప్రయాణాల సదుపాయం కల్పించనున్నారు.ఈ యాప్ ద్వారా యాత్రికులు తక్కువ ఖర్చుతో తమకు కావలసిన ప్రదేశాలకు సురక్షితంగా వెళ్లే అవకాశం పొందుతారు. రవాణా శాఖతో పాటు పర్యాటక, పోలీసు, ఆర్టీజీఎస్, కార్మిక శాఖలను ఈ యాప్‌తో అనుసంధానించనున్నారు. దీని ద్వారా ప్రయాణికుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పిస్తూ ప్రత్యక్ష స్థితి గమనిక సదుపాయం అందుబాటులో ఉంచనున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించే విధంగా భద్రతా చర్యలు ఉండనున్నాయి.మొదట విజయవాడ, తిరుపతి నగరాల్లో ఈ సేవలను ప్రారంభించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఆపై రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నారు. ప్రస్తుతం యాప్ అభివృద్ధి దశలో ఉంది. అవసరమైన నిబంధనలు ఖరారు చేసిన అనంతరం టెండర్లు పిలవనున్నారు. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య పద్ధతిలో ఈ సేవలను నిర్వహించనున్నారు. సేకరించిన రుసుములో పది శాతం నిర్వహణ బాధ్యతలు చేపట్టే కాంట్రాక్టర్‌కు చెల్లించనున్నారు. మిగిలిన నిధులను రవాణా శాఖ ప్రచారం, బ్రాండింగ్ వంటి అవసరాలకు వినియోగించనుంది.త్వరలో కాంట్రాక్ట్ సంస్థల నుంచి బిడ్లు ఆహ్వానించి తక్కువ వ్యయంతో సమర్థవంతంగా సేవలను నిర్వహించగల సంస్థకు టెండర్ ఖరారు చేయనున్నారు. ఇప్పటికే ఆటో డ్రైవర్ల కోసం 'ఆంధ్రా ట్యాక్సీ' యాప్‌ను ప్రవేశపెట్టిన ప్రభుత్వం, ఇప్పుడు 'ఆంధ్రా యాత్రి' ద్వారా రవాణా రంగాన్ని మరింత విస్తరించేందుకు సిద్ధమవుతోంది. రాష్ట్ర రవాణా వ్యవస్థలో ఇది గేమ్ ఛేంజర్‌గా మారుతుందని అధికారులు భావిస్తున్నారు.

# జైళ్లల్లో పెట్టినా తగ్గేదే లే..!

(మొదటి పేజి (తరువాయి)

విరుద్ధమని మండిపడ్డారు.రాష్ట్రంలో రైతులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. పాలనలో స్పష్టత లేకుండా కేవలం ప్రచార కార్యక్రమాలు, కార్యక్రమాల నిర్వహణకే ప్రభుత్వం పరిమితమైందని విమర్శించారు. తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, కనీస అవగాహనతో కూడిన కూర్పు కూడా అందులో కనిపించడం లేదన్నారు. రాష్ట్ర చరిత్రలోనే ఇదే అత్యంత దారుణమైన బడ్జెట్ అని అభిప్రాయపడ్డారు. ఎటు చూసినా అప్పులే కనిపిస్తున్నాయని, తీసుకొచ్చిన అప్పు సొమ్ము ఎక్కడ వినియోగమైందో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, మంత్రి నారా లోకేష్కు తప్ప మరెవరికీ తెలియదని విమర్శించారు.గత ప్రభుత్వం చేసిన అప్పుల్లో రెండు లక్షల 70 వేల కోట్లు డీబీటి కింద పేదల ఖాతాల్లో నేరుగా జమ చేశామని ఆయన తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం చేసిన అప్పులపై స్పష్టమైన వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సగటున రోజుకు 500 కోట్లు అప్పు చేస్తోందని ఆరోపించారు. ఏ ఒక్క రంగానికి సరైన కేటాయింపులు లేవని అన్నారు. యూరియా కోసం రైతులు రోడ్లపై కొట్టుకునే పరిస్థితి నెలకొనడం ప్రభుత్వ వైఫల్యమేనన్నారు. ఫీజు రీయింబర్స్మెంట్ కింద సుమారు 6000 కోట్ల రూపాయల బకాయిలు ఉన్నాయని, ఆరోగ్యశ్రీ కింద కూడా వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయని తెలిపారు.అన్నదాత సుఖీభవ, పేదలకు మూడు సిలిండర్ల వంటి పథకాలు సక్రమంగా అమలు కాలేదని ఆరోపించారు. ఒక్క పథకం కూడా సరిగా అమలు చేయకుండా అంబటి వంటి నేతలపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు. దేశంలో ఎక్కడా ఇటువంటి పరిస్థితులు ఉండవని, ఆంధ్రప్రదేశ్లో లోకేష్ రెడ్బుక్ రాజ్యాంగమే నడుస్తోందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు సరిగా లేని సమయంలో ఎవరిని తీసుకొచ్చినా ప్రయోజనం లేదన్నారు. జైల్లో పెట్టి బెదిరించినా తమ పార్టీ నేతలు భయపడరని స్పష్టం చేశారు.

# కుదిపేసిన బాలిక హత్య

(మొదటి పేజి (తరువాయి)

బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టంకి రలించారు. అలాగే నిందితుడిని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అతడు బెయిల్‌పై బయటకు రాకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, ఇటువంటి ఘటనలపై తమ ప్రభుత్వం సీరియస్‌గా వ్యవహరిస్తోందని హోంమంత్రి అనిత పేర్కొన్నారు. కాగా, మదనపల్లిలో చిన్నారి హత్య కేసు ఉద్రిక్తతకు దారి తీసింది. చిన్నారి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం తీసుకెళ్లేందుకు పోలీసులు చేస్తున్న ప్రయత్నాలను స్థానికులు అడ్డుకుంటూ ఆందోళనకు దిగారు. నిందితుడిని తమకు అప్పగించాలని, లేకపోతే ఎన్‌కౌంటర్ చేయాలంటూ జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ఎస్పీ సహా ఇతర పోలీసు అధికారులు స్థానికులతో చర్చలు జరిపారు.. ఆందోళన కారణంగా చెన్నై?ముంబై జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. చట్టాన్ని చేతిలోకి తీసుకోకూడదని కచ్చితంగా కేసులో నిందితుడికి శిక్ష పడేలా చేస్తామంటూ ఎస్పీ విశ్వనాథ్ స్థానికులకు వివరించే ప్రయత్నం చేస్తున్న స్థానికులు ఆందోళన విరమించక పోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

# శ్రీలక్ష్మికి చుక్కెదురు

(మొదటి పేజి (తరువాయి)

నుంచి తవ్విన ఖనిజాన్ని స్వంత పరిశ్రమలకే వినియోగించాలనే నిబంధనలో ఉన్న పదాన్ని ప్రభుత్వ ఉత్తర్వుల నుంచి తొలగించడం ద్వారా సంస్థకు బయట అమ్మకాల అవకాశాన్ని కల్పించారని ఆరోపించారు. ఇది కావాలనే తీసుకున్న నిర్ణయమని పేర్కొన్నారు. అలాగే ఆమె పదవిలో ఉన్న సమయంలో ఆమె బంధువులు భారీగా అక్రమాస్తులు కూడబెట్టారని, ఇది పరస్పర లాభాల భాగమని న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చారు.ఓబుళాపురం గనుల సంస్థ కేసు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో పెద్ద సంచలనం సృష్టించింది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో అనంతపురం జిల్లాలో గనుల లీజులు కేటాయించగా, కేటాయించిన సరిహద్దులను దాటి అక్రమ తవ్వకాలు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. సుమారు ఎనిమిది లక్షల యాభై వేల టన్నుల ఇనుప ఖనిజాన్ని అక్రమంగా తరలించినట్లు కేంద్ర దర్యాప్తు సంస్థ గుర్తించింది.ఆ సమయంలో గనుల శాఖ కార్యదర్శిగా ఉన్న శ్రీలక్ష్మి నిబంధనలను ఉల్లంఘించి అనుకూల ఉత్తర్వులు జారీ చేశారన్న ఆరోపణలతో 2011లో ఆమెను అరెస్టు చేశారు. కొంతకాలం జైలులో కూడా ఉన్నారు. గత పదేళ్లకు పైగా ఈ కేసు విచారణ దశలోనే కొనసాగుతోంది. తనపై ఉన్న ఆరోపణల్లో నిజం లేదని, విచారణ నుంచి విముక్తి కల్పించాలని ఆమె చేసిన ప్రయత్నాలకు తాజా తీర్పుతో బ్రేక్ పడింది. ఇప్పుడు దిగువ న్యాయస్థానంలో విచారణ వేగవంతం కానుండటంతో ఈ కేసు మళ్లీ రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

# బిల్‌గేట్స్ పర్యటనపైనా వైకాపా అక్కసు

(మొదటి పేజి (తరువాయి)

స్టాంప్స్ శాఖల మంత్రి అనగాని సత్యప్రసాద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రగతికి బిల్‌గేట్స్ అందిస్తున్న తోడ్పాటును చూసి జగన్ అండ్ కో ఓర్వలేకపోతున్నారని ధ్వజమెత్తారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో సాధిస్తున్న అభివృద్ధిని అడ్డుకునేందుకు జగన్ అండ్ కో కుట్రలు పన్నుతున్నారని ఫైర్ అయ్యారు.ఆనాడు ఉమ్మడి ఆంధప్రదేశ్‌లో బిల్‌గేట్స్ సహకారంతో ఐటీ హబ్‌గా హైదరాబాద్ చరిత్ర సృష్టించిందని ఉద్ఘాటించారు. ఈనాడు ఆరోగ్య, వ్యవసాయ, విద్యా రంగాల్లో ఏపీకి వెన్నుదన్నుగా బిల్ గేట్స్ ఉన్నారని చెప్పుకొచ్చారు. ఏపీకి బిల్‌గేట్స్ రాకను బ్లూ మీడియా బ్యాచ్ జీర్ణించుకోలేకపోతోందని దుయ్యబట్టారు. గతంలోనూ అనేక పరిశ్రమలను ఏపీ నుంచి జగన్ అండ్ కో వెళ్లగొట్టారని మంత్రి అనగాని సత్యప్రసాద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఏఐ కళ్లద్దాలతో ప్రధాని మోడీ

(మొదటి పేజి (తరువాయి)



షేర్ చేశారు. ఆ గ్లాసెస్‌కు 'సర్వం కేజ్' అని పేరుపెట్టారు. ఆ తర్వాత మోదీ ఆ అద్దాలను ధరించిన ఫొటోను షేర్ చేశారు. 'వాటిని ధరించిన మొదటి వ్యక్తి ఎవరో తెలుసా..? ప్రధానమంత్రి' అని ప్రత్యూష్ తన పోస్టులో రాసుకొచ్చారు. అది ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో దిగిన చిత్రంగా తెలుస్తోంది. సర్వం కేజ్ కళ్లద్దాలను భారత్‌లోనే అభివృద్ధి చేశామని కుమార్ వెల్లడించారు. ఇది తొలి స్వదేశీ ఏఐ హార్డ్‌వేర్ అని పేర్కొన్నారు. 'ఇది యూజర్ రియల్ వరల్డ్‌లో చూసేవాటిని గమనిస్తుంది.. అర్థం చేసుకుంటుంది.. ప్రతిస్పందిస్తుంది.. క్యాప్చర్ చేస్తుంది' అని వాటి పనితీరు గురించి వివరించారు. త్వరలో వాటికి చాట్ ఫీచర్‌ను కూడా తీసువస్తామని చెప్పారు. ఏఐ గ్లాసెస్‌ను తమ అవసరాలకు అనుగుణంగా కస్టమైజ్ చేసుకోవచ్చు. మేలో ఈ ప్రొడక్ట్ మార్కెట్‌లోకి రానుంది.ప్రపంచవ్యాప్తంగా ఈ స్మార్ట్ గ్లాసెస్ పై ఆసక్తి పెరుగుతోంది. మెటా ఇప్పటికే 'రేబ్యాన్ మెటా' పేరిట గ్లాసెస్‌ను లాంచ్ చేసింది. 2025లో 7మిలియన్ల గ్లాసెస్‌ను విక్రయించింది. త్వరలో యాపిల్ సంస్థ కూడా ఈ తరహా గ్లాసెస్‌ను తీసుకురానుంది. భారత వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ఏఐ నమూనాలపై పనిచేస్తోన్న సంస్థల్లో సర్వం కూడా ఒకటి. ఈ సంస్థ ఇప్పటికే సర్వం అక్షర్ , సర్వం స్టూడియో సారస్ వీ3 ని తీసుకువచ్చింది.

# కోవూరు సమస్యను పరిష్కరించండి



అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 17:

కోవూరు నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు తోడ్పాటు అందించాలని, ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి.. సీఎం చంద్రబాబును కోరారు. మంగళవారం అమరావతిలోని సీఎం కార్యాలయంలో వారు సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా కనిగిరి రిజర్వాయర్ పనులను త్వరితగతిన చేపట్టాలని సీఎంను కోరారు. ముదివర్తి - ముదివర్తి పాలెం వరకు కాజ్ వే నిర్మాణ పనులను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గంగపట్నం, పల్లిపాలెం గ్రామంలో ఉప్పుటేరు వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. బుచ్చిరెడ్డిపాలెం ఫైర్ స్టేషన్‌కు కావాల్సిన అదనపు సిబ్బందిని నియమించాలని సీఎంను కోరారు.

# 101కిలోల గంజాయి స్వాధీనం



హైదరాబాద్ (తెలుగోడు), ఫిబ్రవరి 17:

శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని కొల్లూరులో భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నామని శేర్లింగంపల్లి డిసిపి సిహెచ్ శ్రీనివాస్ తెలిపారు. అక్రమంగా గంజాయిని నిల్వ ఉంచి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను కొల్లూరు పోలీసులు, మాదాపూర్ ఎస్ఓటీ సిబ్బంది సంయుక్తంగా అరెస్టు చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బస్వ జగన్నాథం (37), పల్లపు లక్ష్మీనారాయణ (52) అనే వ్యక్తులు సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో గంజాయి వ్యాపారానికి అలవాటు పడ్డారన్నారు. ఒడిశాకు చెందిన రాజు అనే వ్యక్తి నుంచి సుమారు 101.7 కిలోల గంజాయిని తెప్పించి, తెల్లాపూర్ పరిధిలోని శిల్పా వెంచర్ సమీపంలో కార్మికుల క్యాంపుల వద్ద విక్రయించేందుకు నిల్వ చేశారని పేర్కొన్నారు.ఖచ్చితమైన సమాచారం అందుకున్న పోలీసులు మెరుపు దాడి నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 25.72 లక్షల విలువైన గంజాయితో పాటు నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఒడిశాకు చెందిన ప్రధాన నిందితుడు రాజు ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, అతని కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని డీసీపీ పేర్కొన్నారు. ఈ కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన కొల్లూరు సీఐ గణెశిష్ పటేల్, ఎస్ఓటీ బృందాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించి, రివార్డులు అందజేస్తామని ప్రకటించారు. గంజాయి లేదా మాదకద్రవ్యాల సరఫరాపై సమాచారం ఉంటే డయల్ 100 లేదా సైబరాబాద్ ఎన్‌డీపీఎస్ సెల్ వాట్సాప్ నంబర్ 9490617444కు ఫిర్యాదు చేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని ఆయన స్పష్టం చేశారు.

# పెళ్లికి ముందే శారీరక సంబంధాలు సరికాదు

(మొదటి పేజి (తరువాయి)

వివాహానికి ముందు ఏర్పరచుకునే శారీరక సంబంధాల విషయంలో యువత అత్యంత అప్రమత్తంగా ఉండాలని సుప్రీంకోర్టు సూచించింది. ఒక వ్యక్తి గురించి పూర్తిగా తెలియకుండా లైంగిక సంబంధంలోకి వెళ్లడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించిన ధర్మాసనం, పెళ్లికి ముందు ఎవరినీ సులభంగా నమ్మకూడదని స్పష్టం చేసింది. ఈ వ్యాఖ్యలు చేయడానికి కారణమైన కేసు వివరాల్లోకి వెళితే.. 2022లో ఒక మ్యాట్రిమోనీ సైట్ ద్వారా ఒక యువతికి ఓ యువకుడు పరిచయమయ్యాడు. తాను పెళ్లి చేసుకుంటానని ఆమెను నమ్మించి, పలుమార్లు శారీరక సంబంధం పెట్టుకున్నాడు. అయితే, సదరు యువకుడికి అప్పటికే రెండు పెళ్లిళ్లు అయ్యాయని బాధితురాలికి ఆలస్యంగా తెలిసింది. దీనిపై ఆమె నిలదీయగా, తమకు సంబంధించిన ప్రైవేట్ వీడియోలను బయటపెడతానని అతడు బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు అతనిపై అత్యాచారం కేసు నమోదు చేశారు.ఈ కేసులో నిందితుడు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం ఘాటుగా స్పందించింది. ఒకరి గురించి పూర్తి సమాచారం లేకుండా అంతటి సాన్నిహిత్యం ఏర్పరచుకోవాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించింది. పెళ్లి పేరుతో జరిగే ఇలాంటి మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోర్టు ఈ సందర్భంగా గుర్తు చేసింది.

# మహిళలకు చిన్నారులకు రక్షణ లేదు

## అఘాయిత్యాలను పట్టించుకోని ప్రభుత్వం

## మదనపల్లె ఘటనపై మండిపడ్డ ఎమ్మెల్సీ కళ్యాణి




అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 17:

రాష్ట్రంలో మహిళలకు, చిన్నారులకు రక్షణ లేదని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ధ్వజమెత్తారు. పదే పదే అఘాయిత్యాలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మదనపల్లెలో ఏడేళ్ల చిన్నారిని హత్య చేసి డ్రమ్ములో కక్కేసినా ప్రభుత్వం చోద్యం చూస్తుందోని మండిపడ్డారు. విచ్చలవిడి మద్యం విక్రయాలు కూడా ఇలాంటి నేరాలకు కారణమన్నారు. హోంమంత్రి అనిత బిల్ గేట్స్‌తో ఫోటోలు దిగటం మీద చూపే శ్రద్ద నేరాల నిరోధానికి చూపటం లేదని విమర్శించారు. అబద్ధాల పబ్లిసిటీపై వున్న శ్రద్ధ రాష్ట్రంలో నేర నియంత్రణపై లేదన్నారు. మంగళవారం,తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి వరుదు కల్యాణి మాట్లాడుతూ.. ఏపీలో రోజుకు 70 నుంచి 80 శాతం అఘాయిత్యాలు జరుగుతున్నాయి. నారా లోకేష్ కొలంబో వెళ్ళి క్రికెట్ చూస్తున్నాడు. హిందూపురంలో బాలకృష్ణ అనుచరుడు ఒక మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు దిగాడు. అనపర్తిలో ఆరోతరగతి బాలిక మీద టీడీపీ కార్యకర్త లైంగిక వేధింపులకు దిగితే నేరస్తుడుకే పోలీసులు వత్తాసు పలికారు. పోలీసులను ఈ ప్రభుత్వం ఎందుకు వాడుకుంటోంది?, ఇన్ని సంఘటనలు జరుగుతున్నా హోంమంత్రి ఒక్క చోటకు కూడా ఎందుకు పరామర్శకు వెళ్లలేదు?, మదనపల్లె కేసులో నిందితుడి మీద గతంలో కేసులు ఉన్నాయి. అప్పుడే కఠిన చర్యలు తీసుకుని ఉంటే ఇలాంటి ఘోరాలు జరిగేవి కావు కదా?, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఈ నేరాలకు ఏం సమాధానం చెప్తారు?, భవిష్యత్తు మద్యం అమ్మకాల మీద ప్రభుత్వం అప్పులు తెచ్చింది. దాంతో జనంతో బలవంతంగా తాగిస్తున్నారు. అంటే రాష్ట్రంలో మహిళలు చిన్నారులకు ఇక రక్షణ లేనట్టే. కూటమికి ఓట్లేసి గెలిపిస్తే ప్రభుత్వ పెద్దలు చేసేది ఇదేనా?' అని నిలదీశారు.

# లావాదేవీల్లో డిజిటల్ దూకుడు

(మొదటి పేజి (తరువాయి)

ఒకవైపు నగదు నిల్వలు పెరుగుతుండగా, మరోవైపు దేశంలో జరిగే మొత్తం ఆర్థిక లావాదేవీల్లో నగదు వినియోగం తగ్గుతుండటం విశేషం. కరోనా కాలంలో 2021 మార్చి నాటికి నగదు-స్థూల దేశీయోత్పత్తి నిష్పత్తి 14.4 శాతంగా ఉండగా, తాజా గణాంకాల ప్రకారం అది 11.2 శాతానికి పడిపోయింది. అంటే దేశ ఆర్థిక వ్యవస్థ విస్తరిస్తున్నప్పటికీ, రోజువారీ అవసరాల కోసం ప్రజలు భౌతిక నగదుకంటే డిజిటల్ చెల్లింపులనే అధికంగా ఆశ్రయిస్తున్నారని స్పష్టమవుతోంది.నగదు నిల్వలు పెరగడానికి పలు కారణాలు ఉన్నాయి. భారతీయ స్టేట్ బ్యాంకు నివేదిక ప్రకారం, పన్ను నిబంధనల పట్ల ఉన్న భయం ముఖ్య కారణంగా మారింది. గత ఏడాది జూలైలో డిజిటల్ లావాదేవీల ఆధారంగా సుమారు 18 వేల మంది చిన్న వ్యాపారులకు పన్ను శాఖ నోటీసులు జారీ కావడంతో, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, కేరళ వంటి రాష్ట్రాల్లో ఏటీఎంల వద్ద నగదు ఉపసంహరణలు ఒక్కసారిగా పెరిగాయి. చిన్న వ్యాపారులు మళ్లీ నగదు లావాదేవీల వైపు మొగ్గు చూపుతున్న పరిస్థితి కనిపించింది.ఇంకా బ్యాంకు డిపాజిట్లపై వడ్డీ రేట్లు తక్కువగా ఉండటంతో, ప్రజలు తమ పొదుపు మొత్తాన్ని బ్యాంకుల్లో ఉంచడం కంటే చేతిలో నగదుగా ఉంచుకోవడానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. అత్యవసర అవసరాల కోసం నగదు దగ్గర ఉంచుకోవాలనే భావన బలపడుతోంది. ద్రవ్యోల్బణ ఒత్తిడులు, కుటుంబ అవసరాలు పెరగడంతో గృహస్థులు బంగారం, వెండి విక్రయించి నగదు నిల్వలు పెంచుకుంటున్న ఘటనలు కూడా పెరిగాయి.

ఇదిలా ఉండగా డిజిటల్ చెల్లింపుల విప్లవం దేశంలో వేగంగా విస్తరిస్తోంది. 2020 మార్చిలో నెలవారీగా 140 కోట్లుగా ఉన్న డిజిటల్ లావాదేవీలు 2025 డిసెంబర్ నాటికి 2,163 కోట్లకు పెరిగాయి. 2026 జనవరి నాటికి రోజుకు సగటున 70 కోట్ల లావాదేవీలు జరుగుతున్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. మొత్తం డిజిటల్ చెల్లింపుల్లో ఈ విధానానికి 70 నుండి 80 శాతం వరకు వాటా ఉన్నట్లు అంచనా. చిన్నచిన్న కొనుగోళ్లు, రోజువారీ ఖర్చులు, సేవల చెల్లింపులు అన్నీ డిజిటల్ రూపంలోనే జరిగిపోతున్నాయి.రెండు వేల రూపాయల నోట్ల ఉపసంహరణ తర్వాత ఐదు వందల రూపాయల నోట్ల వినియోగం గణనీయంగా పెరిగింది. 2025 ఏప్రిల్ నుంచి 2026 జనవరి మధ్య వీటి వాటా సుమారు 4.4 శాతం పెరిగింది. అదే సమయంలో ఇరవై రూపాయల కంటే తక్కువ విలువ కలిగిన చిన్న నోట్ల వినియోగం క్రమంగా తగ్గుముఖం పట్టింది.మొత్తం మీద దేశంలో ఒక నిర్మాణాత్మక మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ప్రజలు భద్రత, అత్యవసర అవసరాల దృష్ట్యా నగదును రికార్డు స్థాయిలో దగ్గర ఉంచుకుంటున్నప్పటికీ, రోజువారీ ఆర్థిక కార్యకలాపాల కోసం మాత్రం డిజిటల్ వ్యవస్థలపైనే అధికంగా ఆధారపడుతున్నారు. నగదు తన పాత్రను మార్చుకుని నిల్వ నిధిగా మారుతుండగా, డిజిటల్ విధానం మాత్రం దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా రూపాంతరం చెందుతోంది.



రాముకు సన్మానం చేస్తున్న దృశ్యం

## శ్రీవారి సేవకులకు సన్మానం

**అనంతపురం కల్చరల్ (తెలుగోడు), ఫిబ్రవరి 17 :**
రైతు పాద సేవ మహోత్సవం కార్యక్రమంలో శ్రీవారి సేవకులకు చిరు సత్కారం చేశారు. గుత్తి రోడ్డు సోము దొడ్డి సమీపంలో గల హనుమంతు మొక్కల దాత కార్యాలయంలో మంగళవారం రైతు పాద సేవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కల దాదా హనుమంతు మాట్లాడుతూ రైతు పాద సేవ కార్యక్రమంలో రైతులతో పాటు తులసి ఉసరి మరియు ఎన్నో మొక్కలు అనంతపురం పట్టణంలో ఉచితంగా పంపిణీ చేసిన శ్రీవారి సేవకులకు సన్మానం చేయడం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి సేవకులు ఆళ్లగడ్డ రాము, శ్రీనివాస్, శివ, ప్రకాష్, సురేష్, రామ్ శేషు, అనిల్, ప్రసాద్ ,సుంకు రెడ్డి, నాగరాజు తదితరులు మొమెంటోలు అందుకున్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న జనసేన నేత చిన్న వెంకటేశం, కాలనీవాసులు

## శ్మశాన వాటికకు స్థలం కేటాయించండి
### తహసీల్దార్‌కు జనసేన వినతి..

**గుత్తి (తెలుగోడు), ఫిబ్రవరి 17 :**
గుత్తి మండల కేంద్రంలోని అన్ని వర్గాల వారికి శ్మశాన వాటిక స్థలం కేటాయించాలని కోరుతూ మంగళవారం జనసేన గుత్తి మండలం నాయకులు పోతురాజు చిన్న వెంకటేసు ఆధ్వర్యంలో పై మాలవాడకు చెందిన పలువురు వినతిపత్రం అందజేశారు. ఇటీవల గుమ్మనూరు ఈశ్వర్ ఈ ప్రాంతంలో పర్యటించిన సందర్భంలో తమ కాలనీ వాస్తులకు స్మశాన వాటిక లేక పాత స్మశాన వాటికలో గతంలో పూడ్చిన శవాలను తొలగించి వాటి స్థానంలో ఇటీవల చనిపోయిన వారిని పూడ్చాల్సి వస్తోందని వారు ఆయనకు వివరించారు. దీంతో తాసిల్దార్ పుణ్యవతిని కావాల్సిందిగా సూచించారు. దీంతో మంగళవారం జనసేన నాయకులు చిన్న వెంకటేష్ తో పాటు కాలనీకి చెందిన రమణ రాయల్, దేవేంద్ర రాయల్ తో పాటు పలువురు తాసిల్దార్ కలిసి వినతిపత్రం అందజేశారు



శివపార్వతుల కళ్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

## ఘనంగా శివపార్వతుల కళ్యాణమహోత్సవం

**తాడిపత్రి (తెలుగోడు), ఫిబ్రవరి 17 :**
స్థానిక పుట్లూరు రోడ్డులోని అంబాభవాని దేవాలయంలో సోమవారం శివపార్వతుల కళ్యాణమహోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వకుల సాలి సమాజం సభ్యులు, మహిళా మండలి సభ్యుల ఆధ్వర్యంలో వేదమంత్రాలు నడుమ శివపార్వతుల కళ్యాణాన్ని పురోహితులు వైభవంగా నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి స్వామి వారి కల్యాణం తిలకించారు. అన్న ప్రసాదాన్ని భక్తాదులకు వడ్డించారు. సాయంత్రం అంబా భవాని దేవాలయంలో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పురవీధులలో ఊరేగించారు.



అమ్మవారికి పట్టు చీర సమర్పిస్తున్న జేసీ దంపతులు

## శ్రీ రాజరాజేశ్వరీ దేవికి పట్టుచీర సమర్పించిన జేసీ దంపతులు

**తాడిపత్రి (తెలుగోడు), ఫిబ్రవరి 17 :**
శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి, ఉమా దేవి దంపతులు శ్రీ రాజరాజేశ్వరి దేవికి పట్టుచీరను సమర్పించారు. అంతకుమునుపు శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ శివపార్వతుల కళ్యాణ మహోత్సవంలో జేసీ ప్రభాకర్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు.



శ్రీ బుగ్గరామలింగేశ్వ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

# వైభవంగా శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి మహా రథోత్సవం
### భారీగా తరలివచ్చిన భక్తులు ..

**తాడిపత్రి (తెలుగోడు), ఫిబ్రవరి 17 :**
మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మాఘ బహుళ అమావాస్య సోమవారం సాయంత్రం తాడిపత్రి పట్టణం భక్తిరస, శోభోమయంగా మారింది. శ్రీ రాజరాజేశ్వరీ దేవి సమేతంగా శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామివారి మహా రథోత్సవం ఆశేష జనసంద్రం నడుమ అంగరంగ వైభవంగా జరిగింది. పట్టణంలోని గాంధీ కట్ట వద్ద నుంచి ప్రారంభమైన మహారథం, భజా భజంత్రీలు, దప్పుల నినాదాలు, హర హర శంభో, ఓం నమః శివాయ నామస్మరణల మధ్య పురవీధుల్లో భక్తిని ప్రసరింపజేస్తూ ముందుకు కదిలింది.



శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి మహా రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

**భక్తుల తాకిడి.. పట్టణం మొత్తం శివమయం..**
మహారథోత్సవాన్ని తిలకించేందుకు పరిసర గ్రామాలు, మండలాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. అడుగడుగునా భక్తులు నారికేళాలు సమర్పిస్తూ మొక్కులు తీర్చుకున్నారు. మహారథంపై పూల వర్షం కురిపిస్తూ, మిరియాలు, బెల్లం చల్లుతూ తమ భక్తి విశ్వాసాలను చాటుకున్నారు. మహిళలు హారతులు అందుకోగా, యువత శివనామ స్మరణలతో ఊరంతా మార్మోగించారు. రథం ముందుభాగంలో విచిత్ర వేషధారణలతో కళాకారులు చేసిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గాంధీ కట్ట నుంచి ప్రారంభమైన మహారథం మెయిన్ బజార్ మీదుగా శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహం వరకు వెళ్లి, తిరిగి గాంధీ కట్టకు చేరుకుంది. మార్గమంతా భక్తులతో కిటకిటలాడగా, భక్తుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

**భారీ పోలీసు బందోబస్తు..**
మహారథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి ఆదేశాలతో పట్టణ సీఐ ఆరోహణ రావు పర్యవేక్షణలో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల సురక్షిత రాకపోకలు, అత్యవసర వైద్య సేవల కోసం ప్రత్యేక బృందాలు సిద్ధంగా ఉంచారు. దాతలు భక్తులకు తాగునీరు ఏర్పాటు చేశారు.

**నయనానందకరం కల్యాణోత్సవం..**
ఉదయం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన శ్రీ రాజరాజేశ్వరీ దేవి సమేత శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామివారి కల్యాణోత్సవం భక్తులకు కనులపండువగా నిలిచింది. ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై శివపార్వతుల ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలు, స్వర్ణాభరణాలతో శోభాయమానంగా అలంకరించి, వేద మంత్రోచ్చారణల నడుమ పురోహితులు వైభవంగా కల్యాణ మహోత్సవం నిర్వహించారు.
కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు ఆలయ ప్రాంగణం భక్తులతో నిండిపోయింది. మంగళవాయిద్యాల మధ్య జరిగిన తాళంబ్రాలు, హారతులు, మంగళాష్టకాలు కార్యక్రమానికి మరింత శోభను తెచ్చాయి. కల్యాణోత్సవానికి మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి సతీమణి ఉమాదేవితో కలిసి హాజరైనారు. అనంతరం దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

**చిన్న రథంపై ఉత్సవమూర్తుల విహారం..**
సాయంత్రం దేవస్థానం నుంచి ఉత్సవమూర్తులను చిన్న రథంపై భజా భజంత్రీల నడుమ గాంధీ కట్ట వద్ద ఉన్న మహారథం వద్దకు తీసుకువచ్చారు. అనంతరం మహారథం పీఠంపై శివపార్వతులను ఆశీనులు గావించి పురవీధుల్లో అర్చకులు విహరింపజేశారు. ప్రతి వీధిలో భక్తులు హారతులు పట్టి స్వామివారిని దర్శించుకున్నారు.





శ్రీ బుగ్గరామలింగేశ్వ స్వామి, శ్రీ రాజరాజేశ్వరీ దేవి కళ్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం. కళ్యాణోత్సవానికి హాజరైన భక్తులు

## బేతాపల్లిలో దళితులపై దాడి

**గుత్తి (తెలుగోడు), ఫిబ్రవరి 17 :**
గుత్తి మండల పరిధిలోని బేతాపల్లి గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున దళిత సామాజిక వర్గానికి చెందిన బోయగడ్డ నాగరాజు ఆయన కుమారుడు లోకేష్‌పై దాడి జరిగినట్లు బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసుల కథల మేరకు గత రెండు రోజుల క్రితం కర్నూలు జిల్లా సరిహద్దు గ్రామమైన బోడకొండలో జరిగిన చిరునాల్లో బేతాపల్లి గ్రామానికి చెందిన దళిత యువకుడు లోకేష్ అదే గ్రామానికి చెందిన బోయ కళ్యాణ్ తో చిన్న విషయమై వాదనకు దిగాడు. దళిత సామాజిక వర్గానికి చెందిన యువకుడు తమను బ్రో అని పిలవటం



అగ్రవర్ణాల దాడిలో తీవ్రంగా గాయపడిన బోయకొండ నాగరాజు





దాడిలో ధ్వంసమైన కారు, ద్విచక్ర వాహనం

అవమానంగా భావించిన కళ్యాణ్ సుధాకర్ రాము రామాంజనేయులు తో పాటు మరో ఇద్దరు కలిసి ఇంటికి వచ్చి మూకుమడిగా లోకేష్ ఇంటిపై దాడికి పాల్పడ్డారు ఆ సమయంలో వారు వస్తున్న విషయం తెలుసుకున్న లోకేష్ మరియు ఆయన సోదరుడు అక్కడి నుంచి పారిపోగా ఇంట్లో ఉన్న బోయకొండ నాగరాజు పై కళ్యాణ్ మరియు వారి సమీప బంధువులు దాడి చేసి ఇంటి ఆవరణంలో ఉన్న ఖరీదైన వస్తువులు ధ్వంసం చేయడంతో పాటు కారు అద్దాలు ద్విచక్ర వాహనాన్ని ధ్వంసం చేశారు అంతటితో ఆగకుండా నాగరాజు ను విచక్షణారహితంగా కొట్టారు. దీంతో నాగరాజు తీవ్రంగా గాయపడ్డాడు గాయపడిన అతన్ని స్థానికులు గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటనపై గుత్తి పోలీసులు బోయ సామాజిక వర్గానికి చెందిన కళ్యాణ్తో పాటు మరికొందరు పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# నులిపురుగులతోనే రక్తహీనత
### విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు.. మండల విద్యాధికారిణి డాక్టర్ ప్రియాంక..

**బెళగుప్ప (తెలుగోడు), ఫిబ్రవరి 17 :**
నులిపురుగుతోనే విద్యార్థుల్లో రక్తహీనత ఏర్పడుతుందని, కావున విద్యార్థుల ప్రతి ఒక్కరూ ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని మండల వైద్యాధికారిని డాక్టర్ ప్రియాంక పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన బెళుగుప్ప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగు నివారణ లో భాగంగా విద్యార్థులకు నులి పురుగు నివారణ మాత్రలు (ఆల్బెండజోల్ ) అధికారులు నాయకులతో కలిసి వేశారు. మండల వైద్యాధికారిని డాక్టర్ ప్రియాంక, ఎంఈఓ 1 గోవిందరాజులు,ఎంఈఓ 2 హరికృష్ణ, హెచ్ఎం వెంకటప్రసాద్,టీడీపీ జిల్లా నాయకులు మల్లికార్జున కలసి విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక విద్యార్థులతో మాట్లాడుతూ 1-19 ఏళ్లలోపు ఉన్న అంగన్వాడి కేంద్రాలు, ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలలు,కాలేజీలు,కేజీబీవీ స్కూల్ లకు ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలు భోజనం చేసిన తర్వాత మాత్రలు తీసుకోవాలని తెలియజేసినారు, ముఖ్యంగా' నులి పురుగుల వల్ల ఆకలి లేకపోవడం, కడుపునొప్పి, వాంతులు, విరోచనాలు,రక్తహీనత , ఎదుగుదల లోపం వంటి సమస్యలు వస్తాయన్నారు.ఆల్బెండజోల్ 400 యంజి మాత్రలతో నులి పురుగులను నివారించవచ్చునని వైద్యాధికారిని తెలిపినారు. విద్యార్థిని, విద్యార్థులకు నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజల్ 400 యంజి మాత్రలు మింగించడం, నులి పురుగుల నిర్మూలనపై అవగాహన కల్పించారు . ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా టీడీపీ జిల్లా నాయకులు మల్లికార్జున, ఎంఈఓ లు, హరికృష్ణ, గోవిందరాజులు, హెచ్ యం వెంకట ప్రసాద్,హెల్త్ సూపర్వైజర్ కె. వెంకటరమణ సి హెచ్ ఓ పద్మావతి, సరోజ, ఏఎన్ఎం, రాధమ్మ, హెల్త్ అసిస్టెంట్, గోవిందరాజులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



సన్ రైజర్స్ ఇ.యం పాఠశాలలో విద్యార్థినులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న హెల్త్ సూపర్ వైజర్ వెంకటరమణ, కరెస్పాండెంట్ మారెన్న





బెళుగుప్ప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న టీడీపీ జిల్లా నాయకులు మల్లికార్జున విద్యార్థినులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న ఎంఈఓలు గోవిందరాజులు, హరికృష్ణ, డాక్టర్ ప్రియాంక, హెచ్ఎమ్ వెంకట ప్రసాద్



ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనం, ఐదు లీటర్ల నాటు సారా

## ఐదు లీటర్ల నాటు సారా స్వాధీనం
### వ్యక్తి అరెస్టు..

**గుత్తి (తెలుగోడు), ఫిబ్రవరి 17 :**
గుత్తి ఎక్సైజ్ పోలీస్ సర్కిల్ పరిధిలోని పామిడి మండలం రామగిరి దిగువ తండాకు చెందిన బాలాజీ నాయక్‌ని మంగళవారం గుత్తి ఎక్సైజ్ పోలీస్ అరెస్ట్ చేశారు. అతని వద్ద నుండి ఐదు లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఉమాదేవి తెలిపారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు బాలాజీ నాయక్ నాటు సారా విక్రయాలు సాగిస్తున్నట్లు సమాచారం దాడులు నిర్వహించి అతడు నాటుసార తరలింపుకు వినియోగిస్తున్న ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకోవడంతో పాటు ఐదు లీటర్ల నాటుసారాల స్వాధీనం చేసుకుందామన్నారు. అరెస్ట్ చేసిన అతన్ని కోర్టుకు హాజరపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్ ఆదేశించినట్లు గుత్తి పోలీసులు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ ఐ లు హెడ్ కానిస్టేబుల్ వెంకట్ నారాయణ వెంకటేశు. కానిస్టేబుల్ శివయ్య తదితరులు పాల్గొన్నారు



పోలేరమ్మ తల్లి మూలవిరాట్

## శ్రీ పోలేరమ్మ దేవాలయంలో అన్నదానం, ప్రత్యేక పూజలు

**కనేకల్ (తెలుగోడు), ఫిబ్రవరి 17 :**
కనేకల్ మండల పరిధిలోని ఎర్రగుంట గ్రామంలో వెలసిన శ్రీ పోలేరమ్మ దేవాలయంలో (కోటయ్య క్యాంప్) వద్ద అమావాస్య సందర్భంగా మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తిశ్రద్ధలతో పూజలు, అన్న సంతర్పణ కార్యక్రమాలు నిర్వహించారు. గొర్ల సత్య నారాయణ రెడ్డి వారి కుటుంబం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వీరి కుటుంబానికి శ్రీ పోలేరమ్మ వారి కృప ఎల్లవేళలా అండగా ఉంటూ ఆయురారోగ్య ఐశ్వర సకల సంపద చేకురాలని అర్చకులు, భక్తాదులు ఆశీర్వదించారు. అన్న ప్రసాద స్వీకరణ కార్యక్రమమునకు సుమారుగా వందల మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.



అర్చకుల ఆశీర్వాదం తీసుకుంటున్న గొర్ల కుటుంబం




## డాక్టర్ మండల నాగరాజుకు ప్రతిష్టాత్మక 'గవర్నర్ సుప్రీం లెగసీ ఆనర్ - 2026' పురస్కారం

**అనంతపురం కల్చరల్ (తెలుగోడు), ఫిబ్రవరి 17 :**
అనంతపురం నగరానికి చెందిన సామాజిక కార్యకర్త డాక్టర్ మండల నాగరాజుకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. సామాజిక సేవా రంగంలో ఆయన చేస్తున్న విశేష కృషిని గుర్తిస్తూ 'వర్తీ వెల్‌నెస్ ఫౌండేషన్ ట్రస్ట్' సోమవారం "గవర్నర్ సుప్రీం లెగసీ ఆనర్ – 2026" ప్రశంసా పత్రాన్ని అందజేశారు. డాక్టర్ నాగరాజు సమాజ అభివృద్ధి కోసం, ముఖ్యంగా అణగారిన వర్గాల అభ్యున్నతి మరియు మానవతా విలువలతో కూడిన సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఆయన నిరంతర సేవలను కొనియాడుతూ ఫౌండేషన్ డైరెక్టర్ సౌమ్య బాజ్‌పాయ్ ఈ పురస్కారాన్ని ప్రకటించారు.
ఈ సందర్భంగా డాక్టర్ మండల నాగరాజు మాట్లాడుతూ ఈ గుర్తింపు తనపై బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి మేలు చేస్తానని పేర్కొన్నారు. ఈ అవార్డు రావడం పట్ల పలువురు ప్రముఖులు, ఆయనకు అభినందనలు తెలిపారు.

# బైండోవర్ ఉల్లంఘనకు 15 రోజుల రిమాండ్



విద్యార్థినిలకు నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న హెల్త్ సూపర్వైజర్ జయమ్మ

## విద్యార్థినులకు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ

### హెల్త్ సూపర్వైజర్ జయమ్మ.

అగళి (తెలుగోడు), ఫిబ్రవరి 17 :
జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవంలో భాగంగా మంగళవారం మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో ఉన్న 4899 మంది విద్యార్థులకు గాను 4870 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేసినట్లు మండల పీహెచ్సీ సూపర్వైజర్ జయమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శుక్రవారం ఒక్కరోజులోనే 99శాతం పిల్లలకు ఆల్బండోజల్ పంపిణీ చేశామని మిగిలిన వారికి ఈనెల 24న పంపిణీ చేస్తామని అన్నారు. పాఠశాలల్లో చదివే విద్యార్థిని విద్యార్థులకు నులి పురుగు వలన ఏర్పడే సమస్యలను అవగాహన కల్పించి,ఆరోగ్య సలహాలను అందించి ప్రతి విద్యార్థికి ఆల్బెండజోల్ టాబ్లెట్లను వైద్య సిబ్బంది వేశారని అన్నారు.



లక్ష్మీ నారాయణ కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న అర్చకులు

## సిద్దేశ్వర స్వామి జాతరలో పాల్గొన్న వక్కలిగా కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మి నారాయణ

రొళ్ల (తెలుగోడు), ఫిబ్రవరి 17 :
అమరాపురం మండలం హేమవతి గ్రామం లో జరుగుతున్నా శ్రీ యంజేరు సిద్దేశ్వర స్వామి అగ్నిగుండం మహోత్సవంలో రాష్ట్ర వక్కలిగా కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మి నారాయణ కుటుంబ సభ్యులు సిద్దేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు. వారికి ప్రత్యేక పూజలు చేయించి అలయ కమిటీ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



శ్రీ సిద్దేశ్వరస్వామి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న నవీన్ కుమార్

## అగ్నిగుండ మహోత్సవంలో పాల్గొన్న మండల కో కన్వీనర్ నవీన్ కుమార్

అమరాపురం (తెలుగోడు), ఫిబ్రవరి 17 :
మండల పరిధిలో హేమావతి లో వెలసినశ్రీ సిద్దేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవరోజు అగ్రిగుండం మహోత్సవానికి వి అగ్రహారం పంచాయతీ కో కన్వీనర్ నవీన్ కుమార్ శ్రీ సిద్దేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి అగ్నిగుండ మహోత్సవములో పాల్గొని ధూపం వేసి మొక్కుబడులు తీర్చుకున్నారు



ప్రత్యేక అలంకరణలో కాళికాంభ కామటేశ్వర స్వామి

## కాళికాంబ కమిటేశ్వర స్వామికి ఘనంగా అమావాస్య పూజలు

రొళ్ల (తెలుగోడు), ఫిబ్రవరి 17 :
మండల పరిధిలోని కాళికాంబ కమిటీశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించారు. ప్రతియటా మాఘ మాసం అమావాస్య ని పురస్కరించుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఇందులో భాగంగా దేవాలయంలో వేకువజాము నుంచి నే సుప్రభాత సేవలు చేపట్టారు. అమ్మవారిని వివిధ పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదం వినియోగంతో పాటు మధ్యాహ్నం భక్తులకు కాళికాంభ కామటేశ్వర స్వామి, కొల్లాపూరి మహాలక్ష్మి అర్చకులు విశ్వనాథ్ ఆచార్ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

### నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు .. జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ హెచ్చరిక..

పుట్టపర్తి (తెలుగోడు), ఫిబ్రవరి 17:
బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించి నేరాలకు పాల్పడితే అటువంటి వారిపై పోలీసు శాఖ కఠినంగా వ్యవహరిస్తుందని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ హెచ్చరించారు. బైండోవర్ కాలంలో నేరానికి పాల్పడితే ముందుగా ఒప్పుకున్న మొత్తాన్ని తప్పనిసరిగా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఆ మొత్తం చెల్లించలేని పక్షంలో రిమాండ్‌కు పంపుతామని స్పష్టం చేశారు. లేపాక్షి మండలంలోని గౌరవ మండల కార్యనిర్వాహక న్యాయమూర్తి ఎదుట హాజరైన బైండోవర్ వ్యక్తికి 15 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు. బైండోవర్ అమల్లో ఉన్నప్పటికీ మళ్లీ నేరాలకు పాల్పడే వారికి ఇది జిల్లాలో గట్టి హెచ్చరికగా భావించాలని అన్నారు. ఇకపై బైండోవర్ కాలంలో నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. లేపాక్షి మండలం కంచి సముద్రం గ్రామానికి చెందిన అద్దాల నారాయణస్వామి గతంలో గొడవలు, అల్లర్లు, మహిళపై లైంగిక వేధింపుల కేసుల్లో బైండోవర్ చేయబడ్డాడు. అయితే బైండోవర్ కాలంలో మళ్లీ నేరానికి పాల్పడ్డాడు. తహసీల్దార్ ఉత్తర్వుల మేరకు కోర్టులో చలాన్ చెల్లించాల్సి ఉండగా అతను చెల్లించకపోవడంతో భారతీయ న్యాయ సంహిత 141, 142 సెక్షన్ల కింద మార్చి 3, 2026 వరకు 15 రోజుల న్యాయ రిమాండ్‌కు పంపారు. నేరాలకు పాల్పడే వారు, బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించే వారు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబడరని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. అవసరమైతే చట్టంలోని గరిష్ట శిక్షలు విధించేందుకు వెనుకాడబోమని తెలిపారు. ప్రజాశాంతిని భంగం చేసే చర్యలు, చట్ట విరుద్ధ కార్యకలాపాలు ఎక్కడైనా గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల భద్రతకు విఘాతం కలిగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



మాట్లాడుతున్న శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

## భూముల రీసర్వేపై గ్రామ సభలు

### తహసిల్దార్ సుబ్బారావు.. ఆర్ఐ చంద్రశేఖర రావు..

అగళి (తెలుగోడు), ఫిబ్రవరి 17 :
మండలంలోని మధూడి నరసంబూది పంచాయతీలలో తహసీల్దార్ సుబ్బారావు, ఆర్ఐ చంద్రశేఖర రావు ఆధ్వర్యంలో భూముల రీ సర్వేపై ఆయా పంచాయతీ ప్రజల సమక్షంలో మంగళవారం గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ సుబ్బారావు మాట్లాడుతూ భూములను సాగు చేస్తున్న రైతులందరూ ఆ భూమిని సర్వే చేయుటకు వచ్చే సమయంలో వాటికి ఉన్న హక్కు పత్రాలను సాగు అనుభవం ఉన్న వాటి ధ్రువీకరణ పత్రాలను సర్వే అధికారులకు సమర్పించాల్సి ఉంటుందని అన్నారు. అదేవిధంగా భూమి సాగులో ఉండి సదరు భూమిపై ఇంతవరకు ఎటువంటి హక్కు పత్రాలు పొందకుండా ఉన్నటువంటి రైతులు ఎవరైనా ఉన్నా కూడా ఆ భూమికి సంబంధించిన ఆధారాలు సమర్పిస్తే ఆ భూమిపై హక్కు కల్పించే అవకాశం ఉంటుందని తాసిల్దార్ తెలిపారు. ఇప్పటికే హెద్ది హళ్లి ఈ బ్యాడిగెర పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించామన్నారు.





మధూడి గ్రామసభలో మాట్లాడుతున్న మండల ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్ యాదవ్



మధూడి గ్రామసభలో మాట్లాడుతున్న మండల ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్ యాదవ్


త్వరలోనే మండలంలో భూముల రీసర్వే ప్రారంభం అవుతుందని అన్నారు.ఒక్కో పంచాయతీలో 45 రోజులు లోపు రీ సర్వే జరుగుతుందని అన్నారు. రైతులు సమస్యలు ఏవైనా ఉంటే గ్రామ సభలో సమర్పించి పరిష్కరించు కోవాలని కోరారు.రైతులు సర్వే చేయు సమయంలో అధికారులకు సహకరించాలని కోరారు. మొదటి విడతగా హెద్దిహళ్లి, పి బ్యాడిగెరా,మధూడి, నరసంబూది,ఈ నాలుగు పంచాయతీ లకు చెందిన రైతులు భూ సర్వే నిర్వహించేటప్పుడు సర్వే అధికారులకు తమకు సంబంధించిన భూ హక్కు పత్రాలు ఆధార్ కార్డు బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్ ఫోటోలు తదితర వాటిని అందజేయాల్సి ఉంటుందన్నారు.ఈ గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ సుబ్బారావు ఆర్ఐ చంద్రశేఖర రావు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఆయా పంచాయతీలకు సంబంధించిన రెవిన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది,నాయకులు మండల టిడిపి కన్వీనర్ తిప్పేస్వామి,ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్ యాదవ్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కెంచప్ప యాదవ్,మధూడి పంచాయతీ సర్పంచ్ శివకుమార్,చెరువు ఆయకట్టు ప్రెసిడెంట్ ఎస్.శ్రీధర్, సీనియర్ నాయకులు సోమన్న, గొల్లహట్టి రెడ్డి, నరసంబూది పంచాయతీ సర్పంచ్ సరస్వతి వెంకటస్వామి, మాజీ మండల ప్రధాన కార్యదర్శి జయప్ప, మండల తెలుగు యువత అధ్యక్షుడు గోవిందరాజు,సీనియర్ నాయకులు డాక్టర్ కృష్ణప్ప,దాసప్ప,మాజీ కోఆప్షన్ మెంబర్ రంగప్ప,నారాయణప్ప, రైతులు,గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ దత్తాత్రేయ ఆశ్రమంలో అన్నదానం

అమరాపురం (తెలుగోడు), ఫిబ్రవరి 17 :
మండల పరిధిలో హేమావతిలో వెలసిన శ్రీ దత్తాత్రేయ గురుకుల ఆశ్రమం నందు మంగళవారం వైభవంగా శివరాత్రి శ్రీ సిద్దేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ దత్తాత్రేయ స్వామికి అభిషేకం, రుద్రాభిషేకం, గీతా పారాయణం, శ్రీ గాయత్రీ దేవికి పుష్పాలతో అలంకరణ, లలిత సహస్ర పారాయణం, శ్రీ అభయ ఆంజనేయస్వామికి అభిషేకం రుద్రాభిషేకం, పూజలు, ఆశ్రమ పీఠాధిపతులు శ్రీ సిద్దేశ్వర స్వామి నిర్వహించారు. గుడిబండ మండలం, ఉల్లి కెర గ్రామం వాసులు జగన్నాథ్ మజ్జిగ, కేసరి బాత్ భక్తులకు అందజేశారు. భక్తులకు శ్రీ దత్తాత్రేయ గురుకుల ఆశ్రమ పీఠాధిపతులు శ్రీ సిద్దేశ్వర స్వామి వచ్చిన భక్తాదులకు అన్నదానం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ దత్తాత్రేయ స్వామికి మొక్కుబడులు తీర్చుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



భక్తులకు అన్నదానం చేస్తున్న శ్రీ దత్తాత్రేయ గురుకుల ఆశ్రమ పీఠాధిపతులు శ్రీ సిద్దేశ్వర స్వామి



శ్రీ దత్తాత్రేయ స్వామికి పూజలు నిర్వహిస్తున్న ఆశ్రమ పీఠాధిపతి శ్రీ సిద్దేశ్వర స్వామి

## పిల్లల ఆరోగ్యానికి ప్రాధాన్యత

### బత్తలపల్లిలో 98 మంది విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాల పంపిణీ.. మండల వ్యాప్తంగా ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ.. వైద్యాధికారి డాక్టర్ అరుణ్ కుమార్..

బత్తలపల్లి (తెలుగోడు), ఫిబ్రవరి 17 :
విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఆరోగ్యమే పునాది అని, ముఖ్యంగా కంటి చూపు సమస్యలు చదువుకు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉచితంగా కంటి అద్దాల పంపిణీ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని బత్తలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ అరుణ్ కుమార్ తెలిపారు.మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పలు పాఠశాలల్లో నిర్వహించిన కంటి అద్దాల పంపిణీతో పాటు నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన స్వయంగా పర్యవేక్షించారు. గతంలో నిర్వహించిన కంటి వెలుగు పరీక్షల్లో దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించిన 98 మంది విద్యార్థులకు నాణ్యమైన కంటి అద్దాలను ఈ సందర్భంగా అందజేశారు.ఈ పంపిణీలో బాలికల హైస్కూల్‌కు చెందిన 35 మంది, బాలుర హైస్కూల్‌కు చెందిన 8 మంది, కేజీబీవీ విద్యార్థులు 31 మంది, మాల్యవంతం జడ్పీ హైస్కూల్‌కు చెందిన 5 మంది, అలాగే ఎంజెపిఏపీబీసీడబ్ల్యూ రెసిడెన్షియల్ స్కూల్‌కు చెందిన 21 మంది విద్యార్థులు లబ్ధి పొందినట్లు వైద్యాధికారి వివరించారు.



విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు



విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎంపీడీవో, వైద్యాధికారులు

**వ్యక్తిగత పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం..**

మండలవ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీవో నరసింహా నాయుడు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, నులిపురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత ఏర్పడి శారీరక ఎదుగుదల దెబ్బతింటుందని పేర్కొన్నారు. భోజనానికి ముందు, విసర్జన అనంతరం చేతులను శుభ్రంగా కడుక్కోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవచ్చని విద్యార్థులకు సూచించారు.

మొత్తం 6200 మంది పిల్లలకు గాను 5195 మందికి ఆల్బెండజోల్ మాత్రలు వేయడం జరిగిందని తెలిపారు. పాఠశాలలకు హాజరు కాని (మాత్రలు వేయని) విద్యార్థులకు ఈ నెల 24వ తేదీన ఆల్బెండజోల్ మాత్రలు వేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో బాలుర హైస్కూల్ హెచ్‌ఎం నాగరత్న, బాలికల హైస్కూల్ హెచ్‌ఎం జయంతి, కేజీబీవీ ప్రిన్సిపాల్ గుల్జార్ బేగం, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాజశేఖర్, ఆప్తాలమిక్ ఆఫీసర్ ఉరుకుందప్ప, హెల్త్ సూపర్వైజర్లు అశ్వర్థ, గౌరమ్మ, ఏఎన్ఎంలు లక్ష్మి, మారుతి, డేవిడ్, ముత్యాలమ్మ, ప్రమీల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

## మడకశిర అభివృద్ధిపై సీఎంతో ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు ప్రత్యేక భేటీ

### ఉండవల్లిలోని సీఎం నివాసంలో నియోజకవర్గ పరిస్థితులపై చర్చ.. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధిపై నివేదిక, వినతులు.. అభివృద్ధికి సహాయసహకారాలు అందిస్తామని సీఎం హామీ..

రొళ్ల (తెలుగోడు), ఫిబ్రవరి 17 :
ముఖ్యమంత్రినారా చంద్రబాబునాయుడుతో మంగళవారం ఉదయం అయన నివాసంలో మడకశిర శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు శ్రీసత్యసాయి జిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు ఎం.ఎస్.రాజు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. దాదాపు 30 నిమిషాల పాటు ముఖ్యమంత్రితో ఎం.ఎస్.రాజు భేటీ కొనసాగింది. మడకశిర నియోజకవర్గంలో ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, పెండింగ్ లో ఉన్న పనులు, భవిష్యత్తులో చేపట్టాల్సిన పనులు తదితర అంశాలన్నింటినీ ఎం.ఎస్.రాజు సీఎంకు కూలంకషంగా వివరించారు.
ముఖ్యంగా మడకశిర బైపాస్ కెనాల్, రాళ్లపల్లి, రత్నగిరి రిజర్వాయర్లు, వేసవిలో తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారానికి చర్యలు, ఎస్సీ, బీసీ కాలనీలపై ఉన్న హైటెన్షన్ వైర్ల తొలగింపు, నియోజకవర్గవ్యాప్తంగా 20 సబ్ స్టేషన్ల ఏర్పాటు వాటి ఆవశ్యకతను ఎం ఎస్ రాజు వివరించారు. పుట్టపర్తి నుంచి హిరియూరు జాతీయ రహదారితోపాటు నియోజకవర్గంలో రోడ్లు, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల ఏర్పాట్లకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని తెలిపారు .మడకశిరకు రింగురోడ్డు నిర్మాణం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి సంబంధించిన నివేదిక వినతిపత్రాలన్నింటినీ ఎం.ఎస్.రాజు ముఖ్యమంత్రికి అందించారు.వాటినన్నింటినీ పరిశీలించి, సమస్యలు అన్నీ విన్న ముఖ్యమంత్రి ప్రతి సమస్యపై సానుకూలంగా స్పందించారు. మడకశిర నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు చేపడతామని, పూర్తిస్థాయి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చినట్లు ముఖ్యమంత్రి సానుకూల స్పందనపై ఎం.ఎస్.రాజు కృతజ్ఞతలు తెలియజేశారు.

## 20న ఎంపీపీ, వైస్ ఎంపీపీల ప్రమాణస్వీకారం

రొళ్ల,(తెలుగోడు)ఫిబ్రవరి 17:
స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 20న ఉదయం 10 గంటలకు ఇటీవల నూతనంగా ఎన్నుకోబడ్డ ఎంపీపీ సుమ, వైస్ ఎంపీపీ లు లింగరాజు, సౌమ్య, ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈనెల 4న ఎంపీపీ, వైస్ ఎంపీపీ ల పదవులకు ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. ఎంపీపీగా హులికుంట ఎంపీటీసీ సుమ ను ఎన్నుకోగా వైస్ ఎంపీపీ లుగా గుడ్డుగురికి ఎంపీటీసీ లింగరాజు వైస్ ఎంపీపీ -1గా రొళ్ల -1 ఎంపీటీసీ సౌమ్య ను వైస్ ఎంపీపీ-2గా ఎన్నుకొన్న విషయం తెలిసిందే. వారి ప్రమాణస్వీకారం ఈనెల 20 న చేపట్టడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



హులికుంట ఎంపీటీసీ సుమ



గుడ్డుగురికి ఎంపీటీసీ లింగరాజు



రొళ్ల -1 ఎంపీటీసీ సౌమ్య

## డ్రిప్, స్ప్రింకర్ సౌకర్యాలపై నేడు రైతులకు అవగాహన

అమరాపురం (తెలుగోడు), ఫిబ్రవరి 17 :
అమరాపురంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్మృతి వనంలో బుధవారం 10 గంటలకు రైతులకు డ్రిప్ , స్ప్రింకర్ సౌకర్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు శివకుమార్ , గౌరవ అధ్యక్షులు నారాయణ గౌరవ అధ్యక్షులు, జయకుమార్,, జెడ్పిటిసి స్వారక్క నరసింహమూర్తి పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఏపీ ఎం ఐ పి ప్రాజెక్ట్ డైరెక్టర్ బి సుదర్శన్,, ఎమ్ఐ ఏఓ జి ఎన్ నరసింహప్ప తదితరులు హాజరవుతారని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు

## రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి

### మరో ఉపాధ్యాయునికి తీవ్రగాయాలు..

గుడిబండ (తెలుగోడు), ఫిబ్రవరి 17 :
గుడిబండ మండలం మోపురు గుండు గ్రామంలో విధులు నిర్వహిస్తున్న ఎంటిఎస్ ఉపాధ్యాయులు ఆదినారాయణ(42) మంగళవారం ఉదయం 8:30 గంటల సమయంలో హిందూపురం సమీపంలోని ధనాపురం గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. అతనితో పాటు గుడిబండ మండలం దేవరహట్టి గ్రామంలో ఎంటీఎస్ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న తుమ్మలప్ప కాలు విరిగి తీవ్ర గాయాలై ఆసుపత్రి పాలయ్యారు. వివరాల్లోకి వెళితే శనివారం, ఆదివారం రెండు రోజులపాటు సెలవు ఉండడంతో కదిరి ప్రాంతానికి చెందిన వీరిరువురు శుక్రవారం తమ స్వగ్రామాలకు వెళ్లి మళ్లీ మంగళవారం ఉదయం వారి గ్రామం నుండి ద్విచక్ర వాహనంలో బయలుదేరి వారు విధులు నిర్వహిస్తున్న గ్రామాలకు వస్తున్న క్రమంలో ఉదయం గంటల 8. 30 గంటల సమయంలో హిందూపురం సమీపంలోని ధనాపురం గ్రామం వద్ద మడకశిర నుంచి హిందూపురం వైపు వెళుతున్న ఓ గుర్తు తెలియని కారు వేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో మోపురు గుండు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఆదినారాయణ ద్విచక్ర వాహనం నుండి కిందికి పడి అక్కడికక్కడే మృతి చెందారు. అతనితోపాటు గుడిబండ మండలం దేవర హట్టి గ్రామంలో విధులు నిర్వహిస్తున్న. తుమ్మలప్ప అనే మరో ఎం టి ఎస్ ఉపాధ్యాయులు ద్విచక్ర వాహనంలో వెనకాల కూర్చుని వస్తున్న క్రమంలో అతను కూడా కిందపడి కాలు విరిగి తీవ్ర గాయాలు అయినట్లు అక్కడున్న వారు వెంటనే అతనిని హిందూపురం ప్రభుత్వాసుపత్రికి 108 లో తరలించగా అక్కడ వైద్యులు అతనిని పరీక్షించి మెరుగైన వైద్య చికిత్స కోసం అతనిని అనంతపురంలోని ఓ ఆసుపత్రికి తరలించినట్లు ఉపాధ్యాయుల ద్వారా సమాచారం. మృతిచెందిన ఉపాధ్యాయులు ఆదినారాయణకు చిన్న వయసున్న ఓ కుమారుడు ఓ కుమార్తె ఉన్నట్లు తెలిసింది.

**ఎంఈఓ లు ఎం టి ఎస్, రెగ్యులర్, ఉపాధ్యాయుల సంతాపం..**

రోడ్డు ప్రమాదంలో ఎంటిఎస్ ఉపాధ్యాయులు ఆదినారాయణ మృతి పట్ల గుడిబండ మండలం 1, 2, విద్యాశాఖ అధికారులు ప్రసాద్ రెడ్డి , రవిచంద్ర కుమార్ , 1998 బ్యాచ్‌కు చెందిన రాష్ట్ర ఎంటిఎస్ యూనియన్ ఉపాధ్యక్షులు వై .శంకర్ నాయుడు , ఉమ్మడి అనంతపురం జిల్లా ఎంటీఎస్ యూనియన్ ఉపాధ్యక్షులు నాగార్జున, ఎంటిఎస్ ఉపాధ్యాయులు సునీల్ కుమార్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, బాషా , గుడిబండ మండలం కేజీఎన్ పాలెం గ్రామానికి చెందిన గోవింద నాయక్, మండలంలోని ఎంటీఎస్ ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.



మృతి చెందిన ఆదినారాయణ



విద్యార్థినులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న దృశ్యం

## నులిపురుగులను నులిపేద్దాం ఆరోగ్యంగా ఉందాం

**కోసిగి (తెలుగోడు), ఫిబ్రవరి 17 :**

కోసిగిలోని సజ్జల గుడ్డం రోడ్డు నందు గల ఏపీ మోడల్ స్కూల్ నందు మంగళవారం నాడు డాక్టర్ ఇబ్రహీం జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఇబ్రహీం మాట్లాడుతూ మన కడుపులో నులిపురుగులను నిర్మూలించినప్పుడే ఆరోగ్యం గా ఉంటామని, ఆల్బెండజలు మాత్రలు గురించి విద్యార్థులకు తెలియజేసి, నులిపురుగుల నులిపేద్దాం ఆరోగ్యం గా ఉందాం అని విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగినది . ఈ కార్యక్రమానికి వైద్యులు డాక్టర్ ఇబ్రహీం సామాజిక ఆరోగ్య అధికారిని .ఈశ్వరమ్మ , ఆరోగ్య విస్తరణ అధికారులు ఎల్లప్ప, శ్రీనివాసులు, ఆరోగ్య కార్యకర్త అమరమ్మ ,ఉపాధ్యాయులు విద్యార్థి విద్యార్థులు అందరూ పాల్గొనడం జరిగినది .అలాగే కోసిగి బాలికల హైస్కూల్ నందు డాక్టర్ భరత్ పిహెచ్ఎన్ కోటేశ్వ రమ్మ ,సూపర్వైజర్లు జయమ్మ, రాముడు,ఎం ఎల్ హెచ్ పి యువరాజు, ఆశ వర్కర్లు ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగినది .కోసిగి మండలంలో 28,361 గాను 26,943 మందికి ఆల్బెండజోల్ మాత్రలు వేయడం జరిగిందని. మిగిలిన వాళ్లకు ఈ నెల 24వ తేదీ తేదీన వేయడం జరుగుతుందని వారు తెలిపారు.



పవర్ లిఫ్టింగ్‌లో ప్రతిభ కనబరిచిన దుద్ది విద్యార్థులు

## రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో దుద్ది విద్యార్థికి కాస్య పతకం

**కోసిగి (తెలుగోడు), ఫిబ్రవరి 17 :**

రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో కోసిగి మండలం దుద్ది జిల్లా పరిషత్ హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్న రాజు కాంస్య పతకం సాధించినట్లు హెచ్ ఎం అయ్యస్వాములు తెలిపారు. అమరావతి పవర్ లిఫ్టింగ్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ఆధ్వర్యంలో ఈనెల 13, 14, 15, 16 తేదీలలో కర్నూలు అవుట్ డోర్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో తాయన్న, శివాజీ, రాకేష్, వీరాంజి, రాజు రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొన్నారన్నారు. ఇందులో తొమ్మిదవ తరగతి చదువుతున్న రాజు ్ధ 53 కిలోల కేటగిరిలో 170 కిలోల బరువు ఎత్తి రాష్ట్ర స్థాయిలో కాంస్య పథకం ( మూడవ స్థానం) సాధించినట్లు దుద్ది పాఠశాల ప్రధానోపాధ్యాయులు అయ్యస్వాములు తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అభినందించడం జరిగింది , ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారాయణ , లక్ష్మీకాంత్, నాగలక్ష్మి, సునీత, రమేష్, వెంకటేశ్వర నాయక్, ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మి పాల్గొన్నారు.



ఉపాధి హామీ పథకం పరిరక్షణ యాత్రకు తరలివెళ్లిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

## పని హక్కు పరిరక్షణే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

*కాంగ్రెస్ నేత ఆనందరాజు ..*

**పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 17 :**

ఉపాధి హామీ పథకంలో భాగంగా పని హక్కు పరిరక్షణే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఆనందరాజు స్పష్టం చేశారు. మంగళవారం పీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి కోడుమూరు మండలం గార్గేయపురంలో నిర్వహిస్తున్న “ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర”లో పాల్గొనేందుకు పెద్దకడబూరు మండలం నుంచి నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఆనందరాజు మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరును మార్చే ప్రయత్నాలు చేయడం సరికాదన్నారు. ఉపాధి హామీ పథకానికి మహాత్మాగాంధీ పేరును కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పని హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని బలోపేతం చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడమే తమ ధ్యేయమని, కేంద్రంలో రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరచే వరకు పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. రైతుల పక్షాన నిలబడే పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి బారుసబ్బు అంజినయ్య, మండల మాజీ అధ్యక్షులు నాగరాజు, ఐఎన్‌టీయూసీ తాలూకా నాయకులు ఫిలిప్, ఐఎన్‌టీయూసీ నాయకులు

## అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు

**కోసిగి (తెలుగోడు), ఫిబ్రవరి 17 :**

మండల కేంద్రం కోసిగి లో శ్రీ రేణుక ఎల్లమ్మ, మార్కండేయ స్వామి, ఈశ్వర్ స్వామి, సిద్ధరుడా స్వామి ఆంజనేయ స్వామి దేవాలయంలోఅమావస సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి దేవాలయాల్లో స్వామివార్లకు ఆకు పూజ బిల్వర్చన తదితర వంటి పూజలు నిర్వహించారు మంగళవారం అమావాస్య కావడంతో భక్తులతో దేవాలయాలు సందడి నెలకొంది వచ్చిన భక్తులు స్వామి వార్లకు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యములు సమర్పించి మొక్కుబడును తీర్చుకున్నారు.



శ్రీ రేణుక ఎల్లమ్మవ్వకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం







స్వామివారి పూర్ణకుంభాన్ని ఊరేగింపుగా తెస్తున్న దృశ్యం. శ్రీ సిద్ధారూఢ స్వామి ఉత్సవమూర్తిని ఊరేగింపుగా తీసుకెళుతున్న దృశ్యం

### కమణీయం.. రమణీయం.. భక్తివిహారం...

# వైభవంగా శ్రీ సిద్ధారూఢ స్వామి రథోత్సవం





అశేష భక్తవాహిని నడుమ రమణీయంగా సాగిన శ్రీ సిద్ధారూఢ స్వామి రథోత్సవం

**పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 17 :**

గ్రామమంతా భక్తిరసంతో నిండిపోయేలా పెద్దకడబూరు గ్రామంలో వెలసిన శ్రీ సిద్ధారూఢ స్వామి రథోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా అశేష భక్తజన సమూహం నడుమ రమణీయంగా జరిగింది. ఈ మహోత్సవం ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని సంతరించుకుంది. ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో సాగాయి. స్వామివారికి ఆకుపూజ, కుంకుమార్చన, బిల్వార్చన, పంచామృతాభిషేకం నిర్వహించగా వేదమంత్రోచ్చారణల మధ్య భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆలయం ప్రాంగణం భక్తులతో కిటకిటలాడినది. మధ్యాహ్నం ఆలయ కమిటీ పెద్దలు సత్యనారాయణరెడ్డి, రామ్మోహన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, జగన్నాథ రెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవ ఏర్పాట్లు ఘనంగా చేపట్టారు. ఆలయం నుండి రథం వరకు మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. పుష్పాలతో సుందరంగా అలంకరించిన రథం భక్తుల కళ్లకు కనువిందు చేసింది. సాయంత్రం ఉత్సవమూర్తిని కలశాలతో, మంగళ వాయిద్యాల నడమ రథం వద్దకు ఘనంగా తీసుకువచ్చారు. చిన్నారుల కోలాటాలతో ఉత్సవానికి ప్రత్యేక శోభను తీసుకువచ్చారు. భక్తి భావంతో భక్తులు స్వామివారి రథానికి మొక్కుబడిగా రెండు రుద్రాక్ష గజమాలలను సమర్పించి విశేష భక్తిని చాటుకున్నారు. మాజీ వీఆర్వో రామలింగారెడ్డి ఇంటి నుండి స్వామివారి పూర్ణకుంభాన్ని మంగళవాయిద్యాలతో రథం వద్దకు తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తిని రథంపై ప్రతిష్ఠించి అశేష భక్తవాహిణి నడుమ రథోత్సవం అత్యంత భక్తిపూర్వకంగా కొనసాగింది. భక్తులు రథాన్ని లాగుతూ స్వామివారి నామస్మరణతో ఆధ్యాత్మికోత్సాహాన్ని వ్యక్తపరిచారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారి రథోత్సవాన్ని తిలకించి స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

**పలువురు నాయకుల ప్రత్యేక పూజలు..**



శ్రీ సిద్దారూఢ స్వామి రథోత్సవాన్ని హాజరైన వైసీపీ నాయకులు



రథోత్సవంలో కోలాటంతో అలరిస్తున్న చిన్నారులు

శ్రీ సిద్దారూఢా స్వామి రథోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి, మాజీ ఎంపీపీ నరవ శశిరేఖ, మంత్రాలయం టీడీపీ ఇన్ చార్జ్ రాఘవేంద్ర రెడ్డి తనయులు టీడీపీ యువనేతలు రాకేష్ రెడ్డి, రాజారెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్ రెడ్డి, వైసీపీ రాష్ట్ర కార్యనిర్వాహక మండల సభ్యులు పురుషోత్తం రెడ్డి, ఎంపీపీ శ్రీవిద్య, వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, వైసీపీ బూత్ తాలూకా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎంపీపీ రఘురామ్, వైసీపీ యువజన విభాగం జిల్లా కార్యదర్శి శివరామరెడ్డి, వైసీపీ యువజన విభాగం తాలూకా అధ్యక్షులు నరవ రాజశేఖర్ రెడ్డి, వైసీపీ నాయకులు లక్ష్మీనారాయణ రెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షులు తిక్కారెడ్డి అనుచరులు టీడీపీ నాయకులు టీడీపీ నాయకులు భరద్వాజ్, ఇంద్రసేనారెడ్డి, నీలకంఠ రెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

**గట్టి పోలీసు బందోబస్తు..**

శ్రీ సిద్దారూఢా స్వామి రథోత్సవాన్ని దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కోసిగి సీఐ మంజునాథ్, ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి, ఎస్ఐ నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీ మధ్య కార్యక్రమాలు ప్రశాంతంగా సాగేందుకు పోలీసులు తగిన చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ విజయేంద్రరెడ్డి, సొసైటీ చైర్మన్ తలారి మీ సేవ ఆంజనేయులు, టీడీపీ బీసీ సాధికార రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లికార్జున, టీడీపీ సీనియర్ నాయకులు మధుసూదన్ రెడ్డి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మొట్రు రామాంజనేయులు, టీడీపీ నాయకులు తలారి అంజీ, పెద్ద హనుమంతు, గుమ్మల ఆశన్న, మంచోది ఆదాం, వైసీపీ ప్రచార విభాగం తాలూకా అధ్యక్షులు ముక్కరన్న, వైసీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బొగ్గుల అర్లప్ప, నాయకులు కొరవ సుందరం, సుక్క కుమార్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



శ్రీ సిద్దారూఢ స్వామి రథోత్సవాన్ని హాజరైన టీడీపీ నాయకులు

## సచివాలయం - 2 భవన నిర్మాణాన్ని పూర్తి చేయండి

### ఎంపీడీవోకు కాలనీవాసుల వినతి

**పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 17 :**

పెద్దకడబూరు గ్రామంలో పునాదులకే పరిమితమైన గ్రామ సచివాలయం - 2 భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ప్రభావతి దేవికి కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ముక్కరన్న, బొగ్గుల నరసన్న, మేకల రాజు, గుమ్మల ఆశన్న, బారుసబ్బు అనిల్, బొజ్జప్ప, బొగ్గుల సుధాకర్ మాట్లాడుతూ గ్రామంలోని సచివాలయం - 2 నూతన భవన నిర్మాణం పునాదులకే పరిమితమయిందని గుర్తు చేశారు. అయితే కేవలం పునాదులు తీసి అరకొరగా పిల్లర్లు వేసి ఏకంగా రూ. 16,78,472 డ్రా చేసుకొని సంబంధిత కాంట్రాక్టర్ సొమ్ము చేసుకున్నారని ఎంపీడీవో ప్రభావతి దేవి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సమగ్ర విచారణ చేసి సంబంధిత కాంట్రక్టర్ నుంచి సొమ్మును రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ సచివాలయం - 2 భవన నిర్మాణంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. అలాంటి అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పునాదులకే పరిమితమైన గ్రామ సచివాలయం - 2 భవన నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చేసి ఇక్కడి నుండే సచివాలయ పరిధిలోని ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు కుమార్, సామేలు, దావీదు, సునీల్, బజారప్ప, సందీప్, దేవరాజు, కాకి ఇస్సాక్ తదితరులు పాల్గొన్నారు.



సచివాలయం - 2 భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఎంపీడీవో ప్రభావతి దేవికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

## సైబర్ క్రైమ్ గురించి ప్రజలకు అవగాహన

### డిఎస్పి భార్గవి..

**ఎమ్మిగనూరు (తెలుగోడు), ఫిబ్రవరి 17 :**

సైబర్ క్రైమ్ గురించి ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, మహిళల భద్రత విషయంలో చాలా శ్రద్ధ వహించాలని డిఎస్పి భార్గవి తెలిపారు. గోనెగండ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో గంజహళ్ళి గ్రామంలో డిఎస్పి భార్గవి , గోనెగొండ్ల సీఐ చంద్రబాబు సైబర్ క్రైమ్,, మహిళల భద్రత , బాల్య వివాహాలు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిఎస్పి భార్గవి మాట్లాడుతూ గామాల్లో చిన్న చిన్న విషయాలు వలన జరిగే గొడవలు, ప్రమాదాలు, డ్రంకన్ డ్రైవ్, గ్రామాలలో శాంతిభద్రతలు విషయాలపై కఠినంగా ఉంటామన్నారు. బాల్య వివాహాలు జరగకుండా చూడాలని, గ్రామాల్లో చిన్న చిన్న విషయాలు వలన జరిగే గొడవలు నివారించాలని, యాక్సిడెంట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డ్రంకన్ డ్రైవ్ గురించి కఠినంగా ఉంటామని, గ్రామాలలో శాంతిభద్రతలు కాపాడడానికి సహకరించాలని అన్నారు. 23న జరిగే గంజహళ్ళి శ్రీశ్రీశ్రీ సద్గురు బడేసాహేబ్ స్వాములు ఉసురు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా భద్రతా చర్యలు చేపట్టామన్నారు. శారు. గ్రామంలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు.



అవగాహన కల్పిస్తున్న డిఎస్పి భార్గవి



మాట్లాడుతున్న డిఎస్పి భార్గవి





ముస్లిం మతపెద్దలకు సూచనలు ఇస్తున్న డిఎస్పి భార్గవి

## విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

**కోసిగి (తెలుగోడు), ఫిబ్రవరి 17 :**

ప్రతి ఒక్క విద్యార్థికి విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీదేవి అన్నారు మంగళవారం కోసిగిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో 2025 --26 విద్యా సంవత్సరంకు సంబంధించిన సీనియర్ ఇంటర్మీడియట్ విద్యార్థులకు కళాశాలలో ఫేర్ వల్ పార్టీ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితానికి కాలేజీ జీవితం అనేది ఎంతో ముఖ్యమైనదని ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు. ఎదగాలని కోరారు.కాలేజీ జీవితాన్ని చెడు మార్గాలవైపు మల్లకుండా మంచి వైపు ముందుకు సాగేవిదంగా జాగ్రత్త పడాలన్నారు. విద్యార్థినీ విద్యార్థులు రాస్తున్న పరీక్షల్లో ఏమాత్రం మార్కులు తక్కువ వచ్చిన ఆందోళన చెందక, ఆత్మహత్యల వైపు వెళ్లకుండా మనోధైర్యాముతో ముందుకు సాగాలన్నారు. చాలామంది విద్యార్థులు ఇంటర్మీడియట్ దశలోనే చదువులు మానేసి పొలం బాట పడుతున్నారని అలా కాకుండా సమాజంలోని అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ప్రతి విద్యార్థి తమ జీవితాన్ని బంగారు భవిష్యత్తుగా మార్చుకోవాలన్నారు .అనంతరం విద్యార్థిని విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు ఈ సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులను ఎంతగానో అలరించాయి.ఇందులో కళాశాల అధ్యాపకులుమరియు సిబ్బంది సునీల్ ,ఈ రన్న వెంకటేషప్ప, రాణ ప్రతాప్, గోవింద్ ,సాంబశివుడు, ఆనంతమ్మ, జ్యోతి, ప్రకాష్, కీర్తి నాగేంద్ర, ,నవీన్ కొండయ్య ,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



సరస్వతి పూజ చేస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి

## 1వ తరగతిలో పవేశానికి దరఖాస్తు చేసుకోండి

*ఎంఈఓ బాలయ్య..*

**కోసిగి (తెలుగోడు), ఫిబ్రవరి 17 :**



కోసిగితో పాటు మండల పరిధిలోని ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 2026-2027 విద్యా సంవత్సరానికి గాను 1వ తరగతిలో ప్రవేశం కోసం 25 శాతం ఉచిత సీట్లకు పేద, బలహీన వర్గాల పిల్లలు ఈ నెల 20 వ తేదీ నుండి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ బాలయ్య మంగళవారం తెలిపారు. విద్యా హక్కు చట్టం 2009 సెక్షన్12(1)సి , జిఓ ఎంఎస్129 తేదీ 15--7-2022 విద్యా శాఖ ఆదేశాల మేరకు ఉచిత సీట్ల కోసం ఆన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ సదవకాశాన్ని పేద,బలహీన వర్గాల తల్లిదండ్రులు ఉపయోగించుకొని తమ పిల్లలకు బంగారు భవిష్యత్ ఇవ్వాలని కోరుతున్నట్లు బాలయ్య తెలిపారు.



భైరవకొండపై విజయాంబిక భైరవలింగేశ్వర స్వామి పల్లకి సేవ నిర్వహిస్తున్న భక్తలుల

# శ్రీ విజయ అంబికా భైరవ లింగేశ్వర స్వామి శోభాయాత్ర

**యాడికి (తెలుగోడు), ఫిబ్రవరి 17 :**
యాడికి భైరవకొండపై వెలసిన భైరవలింగేశ్వర స్వామికి మాఘమాసం పూజలన్నీ అయిపోయిన పిమ్మట నిన్నటి దినమున కళ్యాణం జరిగింది యాడికి పురవీధుల్లో శోభాయాత్ర అనంతరం మాఘమాసం చివరి రోజు రాత్రి 7 గంటల నుండి భక్తి పాటలతో భజన కార్యక్రమాలు స్వామివారికి పవళింపు సేవ ప్రతి సంవత్సరము లాగానే అన్ని పూజాది కార్యక్రమాలు నిర్వహించి కార్యక్రమ అనంతరం దాదాపుగా 300 మందికి విందు భోజనం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు శంకరాచారి పాంశెట్టి శ్రీరాములు రఘురామయ్య దాసరి కృష్ణ పవన్ భాస్కర్ సూరి తదితరులు పాల్గొన్నారు



భైరవకొండపై విజయాంబిక భైరవలింగేశ్వర స్వామి పల్లకి సేవ నిర్వహిస్తున్న భక్తలుల

# లేగ దూడల ప్రదర్శన

**యాడికి (తెలుగోడు), ఫిబ్రవరి 17 :**
యాడికి పశు వైద్యశాల ఆవరణలో మంగళవారం రాష్ట్రీయ గోకుల్ మిషన్ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ అనంతపురం వారి సౌజన్యంతో మేలు జాతి లేగదూడల ప్రదర్శన శిబిరం నిర్వహించారు. యాడికి పెద్దపేట గ్రామాల నుండి 58 మేలు జాతి లేగ దూడలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి. వాటిని పరిశీలించి మూడు మేలు జాతి దూడలకు బహుమతులు ప్రధానం చేసినట్లు పశు వైద్యాధికారులు తెలిపారు.
రైతులకు 100 శాతం సబ్సిడీతో లింగ నిర్ధారిత వీర్యం 9 శాతం కచ్చితంగా ఆడదూడలు పుట్టే వీర్యంను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శ్రీకాంత్, విజయలక్ష్మి, సుబ్బారెడ్డి, పశువైద్య సిబ్బంది రైతులు పాల్గొన్నారు.



లేగ దూడలను ప్రదర్శిస్తున్న దృశ్యం
రైతులకు బహుమతులు ప్రదానం చేస్తున్న పశువైద్య అధికారులు



# క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రజలను చైతన్యవంతం చేయాలి

## ఏఎస్పీ విబు కృష్ణ .. హర్ష హాస్పిటల్, మెడి కవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో 2 కె వాక్.. ప్రారంభ దశలో గుర్తిస్తే క్యాన్సర్ వ్యాధి నయం .. ప్రముఖ ఆంకాలజిస్ట్ డా.రంగరామన్..

**ప్రొద్దుటూరు (తెలుగోడు), ఫిబ్రవరి 17 :**
క్యాన్సర్‌పై అవగాహన పెంచుతూ ప్రజల్లో ఆరోగ్య జాగ్రత్తలపై చైతన్యం తీసుకురావాలనే లక్ష్యంతో 2కె వాక్ నిర్వహించడం అభినందనీయమని ప్రొద్దుటూరు ఏఎస్పీ విబు కృష్ణ అన్నారు. పట్టణంలో మంగళవారం ప్రొద్దుటూరు హర్ష హాస్పిటల్,నెల్లూరు మెడికవర్ హాస్పిటల్, ప్రొద్దుటూరు రోటరీ క్లబ్, ఎస్వీ డిగ్రీ కాలేజీ, ప్రొద్దుటూరు ఆర్య వైశ్య బృందం ఆధ్వర్యంలో క్యాన్సర్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. 2 కె వాకథాన్‌ను ప్రొద్దుటూరు ఏ.ఎస్.పి. విబు కృష్ణ జెండా ఊపి ప్రారంభించారు.ప్రొద్దుటూరు గీతాశ్రమం నుండి ప్రారంభమైన ఈ 2 కె వాక్.. శివాలయం వరకు కొనసాగింది.వైద్యులు,విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సంధర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని హర్ష హాస్పిటల్, మెడికవర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్, నెల్లూరు ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు విస్తృత కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయనన్నారు. ఇందులో భాగంగా భారీ స్థాయిలో క్యాన్సర్ అవగాహన వాకథాన్ తో పాటు ప్రజలతో ప్రత్యక్ష అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారన్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్య






సంరక్షణ పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. క్యాన్సర్ వ్యాధిపై అవగాహన పెంపొందించుకోవాలని ఆయన సూచించారు.
మెడి కవర్ హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ జి.రంగ రామన్ మాట్లాడుతూ భారత్‌లో ప్రతి సంవత్సరం 14 లక్షలకు పైగా కొత్త క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయన్నారు. వీటిలో అధిక శాతం కేసులు ఆలస్యంగా గుర్తించడం వల్ల ప్రాణాపాయం జరుగుతోందని తెలిపారు.సమయానికి పరీక్షలు చేయించుకుంటే, ప్రారంభ దశలోనే క్యాన్సర్‌ను పూర్తిగా నియంత్రించవచ్చని స్పష్టం చేశారు.ఆధునిక కీమోథెరపీ, టార్గెటెడ్ థెరపీ, ఇమ్యునోథెరపీ వంటి చికిత్సలతో క్యాన్సర్ ఫలితాలు గణనీయంగా మెరుగయ్యాయని చెప్పారు.అయినప్పటికీ అవగాహన, ప్రారంభ దశలో నిర్ధారణే ప్రధాన ఆయుధమన్నారు.వ్యాధి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు.
హర్ష హాస్పిటల్ ఎండి డాక్టర్ కాల్వ విజయ నాగేంద్ర మాట్లాడుతూ ప్రారంభ దశలో గుర్తించిన క్యాన్సర్‌ను శస్త్రచికిత్స ద్వారా పూర్తిగా నయం చేయవచ్చున్నారు.ముఖ్యంగా 40 ఏళ్లు పైబడిన వారు బ్రెస్ట్, ఓరల్, సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్‌ను తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు.ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ పి.సమిత మాట్లాడుతూ క్యాన్సర్‌పై ఉన్న భయాన్ని, అపోహలను తొలగించడమే మా లక్ష్యమని తెలిపారు.అవగాహన, సమయానికి వైద్య సలహా తీసుకోవడం ద్వారా క్యాన్సర్ ను జయించవచ్చున్నారు.
ఈ కార్యక్రమంలో హర్ష హాస్పిటల్ వైద్యులు డా.శ్రీ లక్ష్మీ, డా. మౌనిక, డా.సాయి గణేష్,డా. రిషిత,డా.ఉదయ్ సాగర్,ఏఓ కిరణ్,మెడికవర్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ సెంటర్ హెడ్ పవన్, ఆర్య వైశ్య ప్రెసిడెంట్ ఉపేంద్ర,డా.సురేష్ కుమార్ రెడ్డి, డా. నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# ఆధ్యాత్మిక జాగృతితో సమాజం మేల్కొలుపు

## ఓం శాంతిలో 90 త్రిమూర్తి శివ జయంతి మహోత్సవాలు .. బ్రహ్మా కుమారి సుధారాణి ..

**ఎల్ఎస్ పేట (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**
ఆధ్యాత్మిక జాగృతితో సమాజం మేల్కొలుపు దోహదపడుతుందని బ్రహ్మకుమారి సుధారాణి అన్నారు.మండలంలోని లక్ష్మీ నర్సు పేట ప్రజాపిత బ్రహ్మ కుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం (ఓం శాంతి) శివ జ్ఞాన అమృత భవనంలో 90 వ త్రిమూర్తి శివ జయంతి మహోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు.శివ పతాక ఆవిష్కరణ, జ్యోతి ప్రజ్వలన,కేక్ కట్ చేసి ఆనందోత్సవాలు జరుపుకున్నారు.అనంతరం బ్రహ్మ కుమారి జీవన జ్యోతి ఆద్వర్యంలో నిర్వహించిన సమావేశంలో బ్రహ్మకుమారి సుధారాణి మాట్లాడుతూ అజ్ఞానం ను దూరం చేసి జ్ఞానాన్ని పెంపొందించడానికి పరం జ్యోతి స్వరూపుడు పరమేశ్వరుడు భూమి పై అవతరించే స్మిత చిహ్నంగా మహా శివరాత్రి,ఈ పర్వదినం సందర్భంగా జాగరణ, ఉపవాసము చేస్తుంటారు.ఆత్మ జాగృతి కి జాగరణ చేసి,మంచి గుణాలు ఆలోచన ఉపవాసం ఆచరించవలసిన జ్ఞాన మార్గాలు, ఆరోగ్య పరిరక్షణ అవశ్యకత తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీ



శివయ్యకు పూజలు నిర్వహించిన దృశ్యం

మోహిని,పద్మ ,రాజ్యలక్ష్మి, విజయ లక్ష్మి, పరివార సభ్యులు తదితరులు పాల్గొన్నారు



త్రిమూర్తి శివ జయంతి నిర్వహిస్తున్న దృశ్యం




రైతు కొనుగోలు చేసిన వరి కోత మిషన్‌ను పరిశీలిస్తున్న బ్యాంకు మేనేజర్ వెలమూరి హరీష్

# బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోండి

## ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు మేనేజర్ వెలమూరి హరీష్

**టి.సుండుపల్లి (తెలుగోడు), ఫిబ్రవరి 17 :**
రైతుల ఆర్థిక అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఎంతో దోహదపడుతుందని బ్యాంకు మేనేజర్ వెలమూరి హరీష్ తెలిపారు. మంగళవారం రాయవరం గ్రామపంచాయతీ కావలపల్లికి చెందిన చనంశెట్టి వెంకటేష్‌కు రూ.23 లక్షల రుణం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఇచ్చినట్లు తెలిపారు. వరి కోత మిషన్ కొనుగోలు కోసం రైతు బ్యాంకును ఆశ్రయించడంతో లోను మంజూరు చేయడం జరిగిందన్నారు. రైతులు ఖాతాదారులు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పలు రకాల లోన్లు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ద్వారా ఇవ్వడం జరుగుతుందని అన్నారు. అలాగే ఖాతాదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా బ్యాంకు సేవలను అందిస్తున్నట్లు తెలియజేశారు. అనంతరం రైతు కొనుగోలు చేసిన వరి కోత మిషన్ను బ్యాంకు సిబ్బందితో కలిసి పరిశీలించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణ

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి

## టిడిపి అధ్యక్షుడు వెంకటరమణ ..

**రామకుప్పం (తెలుగోడు), ఫిబ్రవరి 17 :**
మండలంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందే విధంగా చొరవ తీసుకోవాలని టిడిపి మండలాధ్యక్షుడు వెంకటరమణ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని విజలాపురం, ఉన్సిగానిపల్లి పంచాయతీల్లో కుటుంబ సాధికార సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా మండలంలో నిరుపేదలకు అండగా ఉండి ప్రభుత్వం ద్వారా అందిస్తున్న వివిధ ప్రోత్సాహకాలను అందించాలన్నారు. అర్హులందరికీ పెన్షన్లు, ఇంటి నిర్మాణాలు, గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. రానున్న స్థానిక ఎన్నికలకు ఇప్పటినుంచే సంసిద్ధమై పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కామరాజు నాయక్, నేతలు రామ్మూర్తి, వెంకటరామ గౌడు, శ్రీనివాసరెడ్డి, గుర్రప్ప, విశ్వనాథ్, జయశంకర్, నాగభూషణం, శంకరాచలం,రఘు, కృష్ణారెడ్డి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందులు వేస్తున్న డాక్టర్ పూజిత

# నులి పురుగుల నివారణ కార్యక్రమానికి విశేష స్పందన

**రామకుప్పం (తెలుగోడు), ఫిబ్రవరి 17 :**
మండలంలోని విజలాపురం ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్ర పరిధిలో జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవం నిర్వహించారు. మంగళవారం డాక్టర్ పూజిత ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్ర పరిధిలోని వివిధ పాఠశాలలు అంగన్వాడీ విద్యార్థులకు కేజీబీవీ పాఠశాల, మండల కేంద్రంలోని గ్రీన్ వ్యాలీ పబ్లిక్ స్కూల్, అక్షర స్కూల్ విద్యార్థులకు నులి పురుగు నివారణకు మందులను వేశారు. దీంతో కడుపునొప్పి రక్తహీనత తో పాటు విటమిన్ లోపాలు సమస్యలు రావని తెలిపారు. ఈ కార్యక్రమం లో హెల్త్ ఆక్సిడెంట్ బాలు, ప్రమీల ఏఎన్ఎంలు ,ఆశా వర్కర్లు వివిధ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

# మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో పూర్ణాహుతి

**శ్రీశైలం (తెలుగోడు), ఫిబ్రవరి 17 :**
మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నవాహ్నిక దీక్షతో పదకొండు రోజుల పాటు నిర్వహించిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో పదవరోజైన మంగళవారం ఉదయం శ్రీ స్వామిఅమ్మవార్లకు విశేషపూజలు జరిగాయి. తరువాత శ్రీ స్వామివారి యాగశాలలో శ్రీ చండీశ్వరస్వామికి ప్రత్యేక పూజాదికాలు జరిపించారు. రుద్రహోమం, చండీహోమం తరువాత యాగ పూర్ణాహుతి, వసంతోత్సవం, అవబృథం, త్రిశూలస్నానం, కార్యక్రమాలు నిర్వహించారు. పూర్ణాహుతి కార్యక్రమంలో శాస్త్రోక్తంగా నారికేళాలు, పలు సుగంధ ద్రవ్యాలు, ముత్యం, పగడం, నూతన వస్త్రాలు, ద్రవ్యాలను హోమగుండంలోకి ఆహుతిగా సమర్పించి యాగ కార్యక్రమాన్ని పూర్తి చేశారు. అనంతరం జరిగిన వసంతోత్సవంలో ఆలయ అర్చకులు, వేదపండితులు వసంతాన్ని (పసుపు, సున్నం కలిపిన మంత్ర పూరిత జలం) సమంత్రకంగా భక్తులపై ప్రోక్షించారు. తరువాత జరిగిన అవబృథస్నానంలో చండీశ్వరస్వామికి ఆలయపుష్కరిణి వద్ద ఆగమశాస్త్రోక్తంగా స్నపన కార్యక్రమం నిర్వహించబడింది. చివరగా త్రిశూలస్నానం నిర్వహించారు. పూర్ణాహుతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకస్వాములు, అధ్యాపక (స్థానాచార్యులు) వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

**ధ్వజావరోహణం..**
ఈ బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం నాడు సాయంకాలం ధ్వజావరోహణ కార్యక్రమం నిర్వహించారు. ధ్వజావరోహణ కార్యక్రమంలో ఉత్సవాల మొదటిరోజున బ్రహ్మోత్సవ ప్రారంభ సూచకంగా ఆలయ ప్రధాన ధ్వజస్తంభంపై ఆవిష్కరింపజేసిన ధ్వజపటం అవరోహణ చేశారు.



పూజలందుకున్న స్వామి, అమ్మవార్లు

**సదస్యం -నాగవల్లి..**
మహాశివరాత్రిబ్రహ్మోత్సవాలలో భాగంగానే నిత్య కల్యాణ మండపంలో సదస్యం, నాగవల్లి కార్యక్రమాలు జరిపించారు. సదస్యం కార్యక్రమంలో వేదపండితులు చతుర్వేద పారాయణలతో, స్తోత్రాలతో శ్రీస్వామిఅమ్మవార్లను స్తుతించారు. ఆ తరువాత నాగవల్లి కార్యక్రమంలో మహాశివరాత్రి రోజున కల్యాణోత్సవం జరిపించిన శ్రీ భ్రమరాంబాదేవి వారికి ఆగమశాస్త్రం సంప్రదాయం మేరకు మెట్టెలు, నల్లపూసలు సమర్పించారు..

**నేటితో ముగియనున్న బ్రహ్మోత్సవాలు..**
మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు బుధవారం ముగియనున్నాయి. ఈ ఉత్సవాల ముగింపులో భాగంగా బుధవారం ఉదయం శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషపూజలు జరిపిస్తారు. . రేపు సాయంకాలం శ్రీ స్వామివార్లకు అశ్వవాహనసేవ , ఆలయ ఉత్సవం జరిపిస్తారు. ఆలయ ఉత్సవం అనంతరం శ్రీస్వామిఅమ్మవార్లకు పుష్పోత్సవం, శయనోత్సవం జరిపిస్తారు.



త్రిశూల స్నానం నిర్వహిస్తున్న అర్చకులు



పూర్ణాహుతి పూజలు చేస్తున్న అర్చక స్వాములు



సిద్ధేశ్వర స్వామిని దర్శించుకున్న జనసేన నాయకులు

## సిద్దేశ్వర స్వామి జాతరలో పాల్గొన్న జనసేన నాయకులు

**రొళ్ల (తెలుగోడు), ఫిబ్రవరి 17 :**

అమరాపురం మండలం హేమవతి గ్రామంలో జరుగుతున్న శ్రీ యంజేరు సిద్దేశ్వర స్వామి అగ్నిగుండం మహోత్సవంలో జనసేన పార్టీ సమన్వయకర్త టి రంగస్వామి సిద్దేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అతనిని ఘనంగా సన్మానించారు. వారికి ప్రత్యేక పూజలు చేయించి అయన అలయ కమిటీ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమానికి జనసేన పార్టీ నాయకులు చెరువు అయకట్ట డైరెక్టర్ శివరాం శివకుమార్, జనసేన అలయ కమిటీ సభ్యులు నాగరాజు పాల్గొన్నారు.



జాతరలో పాల్గొన్న జనసేన నాయకులు

## ఎమ్మెస్ రాజు ఎమ్మెల్యే కావడం ఈ ప్రాంత ప్రజల అదృష్టం

*యువ నాయకుడు మంజు చరణ్ ..*

**అగళి (తెలుగోడు), ఫిబ్రవరి 17 :**

ఎమ్మెస్ రాజు మడకశిర నియోజకవర్గ ఎమ్మెల్యే కావడం ఈ ప్రాంత ప్రజలు చేసుకున్న అదృష్టమని మండల పరిధిలోని ఇరిగేపల్లి గ్రామానికి చెందిన యువ నాయకుడు మంజు చరణ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా అతను మాట్లాడుతూ మడకశిర నియోజకవర్గం అభివృద్ధిపై ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసానికి నేరుగా వెళ్లి 30 నిమిషాలు ప్రత్యేకంగా భేటీ కావడం, అందుకు ముఖ్యమంత్రి సానికూలంగా స్పందించి నియోజకవర్గ అభివృద్ధికి సహాయ సహాకారాలు అందిస్తామని హామీ ఇవ్వడం ఎమ్మెల్యేకు ఇక్కడి ప్రజలపై ఉన్న అభిమానాన్ని చాటుతోందన్నారు. అన్నా... మాకు తెలుసు నీకు ఒక కుటుంబం ఉందని అది మొత్తం మడకశిర నియోజకవర్గం అని ఒక వ్యక్తిగా ఆలోచిస్తావో శక్తిగా ఆలోచిస్తావో తెలీదుకానీ చెప్పిన పని చేసేవరకు నిద్ర పోవు.. రాత్రనక.. పగలనక ఎప్పుడూ ప్రయాణం చేస్తూ... నిన్ను గెలిపించిన ప్రజలను జీవితంలో గెలిపించేంతవరకు విశ్రమించవు అని తెలుసు అన్నారు. అందరూ చెప్తారు.. చంద్రబాబు అధికారులను, నాయకులను నిద్రపోనివ్వరు అని.. కాని నువ్వేమో మడకశిర అభివృద్ధి విషయంలో చంద్రబాబుని నిద్రపోనివ్వకుండా చేస్తున్నావ్.అది మాత్రం నిజం.. అన్న ఇదేమీ పొగడ్తలు కాదు.. నీలాంటి ఎంఎల్ఏ మడకశిరకి ఉండడం మడకశిర నియోజకవర్గం ప్రజల అదృష్టం అని అన్నారు




## విచ్ఛిన్నం వైపు ఆర్ డి టి ఉద్యమం

ఆర్డిటి పరిరక్షణ కాకుండా సొంత ప్రాబల్యాలను పెంచుకోవడం కోసమే ఉద్యమం చేస్తున్నారా, అంటే అవుననే చెబుతున్నారు మేధావులు అనంత ప్రజలు.

ఆరు నెలల క్రితం ఉవ్వెత్తు లేచిన ఆర్ డి టి ఉద్యమాన్ని,అధికార కూటమి ప్రభుత్వం,రెన్యువల్ చేసే బాధ్యత మాదేనని, ప్రధానమంత్రి,కేంద్ర హోంశాఖ మంత్రితో మాట్లాడుతున్నామని,ఇది నిజమో కాదో తెలుసుకోవడానికి ఆర్డిటి వ్యవస్థాపకులు మాంచో ఫెర్రర్ గారిని సైతం విజయవాడకు తీసుకువెళ్లి ముఖ్యమంత్రిని, ఐటీ శాఖ మంత్రిని కలిపి వారిలో నమ్మకాన్ని కలిగించే విధంగా,వారితో ఫోటోలు దిగి,ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో హల్చల్ చేసి, రెన్యువల్ అయిపోయిందన్న సంకేతాలను ఉద్యమ నాయకులలోకి,ఆర్ డి టి వ్యవస్థలోకి తీసుకువెళ్లి,ఈ జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రజా ప్రతినిధులు సఫలీకృతమై, ఆర్ డి టి ఉద్యమం పై నీళ్ళు చల్లారు.



తీరా ఆరు నెలల తర్వాత అది అంతా డొల్ల అని, రెన్యువల్ జరగడానికి అవకాశాలు లేవని,తెలిసిన తర్వాత,ఎస్సీ ఎస్టీ జేఏసీ నాయకులు మరొక్కసారి ఉద్యమానికి పూనుకుంటున్న సందర్భంలో కొంతమంది ఈ ఉద్యమాన్ని యధాతంగా విచ్ఛిన్నం చేయడం కోసం ఉద్యమానికి మేము సైతం అంటూనే ఎవరికి వారుగా విడివిడిగా ఉద్యమాలు చేయడానికి పూనుకుంటున్నారు.దీనివల్ల తమ సొంత ప్రాబల్యం పెరుగుతుందో లేదో తెలియదు గాని,ఉద్యమ స్ఫూర్తి దెబ్బతింటుంది.దీనికి కారణాలు లేకపోలేదు అదేమిటంటే ఒక నాయకునికి తెలియకుండా మరొక నాయకుడు ఆర్ డి టి సంస్థ ద్వారా ఆర్థిక లబ్ధి పొందుతున్నారన్న అనుమానాలు,ఆ సంఘాల మధ్య ఉన్న వ్యక్తిగత వైషమ్యాలు.

తిరిగి ఉద్యమాన్ని పునః ప్రారంభించే దానిలో భాగంగా ఈ నెల 9వ తేదీన స్వర్గీయ ఫెర్రర్ గారి విగ్రహానికి పూలమాల వేసి ఉద్యమానికి శ్రీకారం చుట్టిన జేఏసీ,ఈనెల 12వ తేదీన అనంతపురం నగరంలోని ఎన్జీవో హోమ్ లో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి,అందరినీ ఆహ్వానించి,ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తే,దానికి ఉభయ కమ్యూనిస్టు పార్టీలు, కొన్ని ప్రజాసంఘాలు రాకపోగా,ఉభయ కమ్యూనిస్టు పార్టీలు ప్రత్యేక అజెండాతో ముందుకు పోవాలని ప్రెస్ క్లబ్ లో రౌండ్ టేబుల్ సమావేశం జరపడం,ఆ సమావేశంలో అధికార,ప్రతిపక్ష పార్టీలు ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకోవడంతో పోలీసులు రంగ ప్రవేశం చేయాల్సి వచ్చింది,తద్వారా రౌండ్ టేబుల్ సమావేశం రసాభాస కావడం,ఆ సందర్భంగా తీసుకున్న ఉద్యమ కార్యాచరణ,దొంగ చేతికే తాళాలు ఇచ్చినట్లు,ఉద్యమాన్ని అణచివేసిన కూటమి ప్రభుత్వం దగ్గరకే వెళ్లి వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయించడం,వెనక కమ్యూనిస్టులను తెలుగుదేశం పార్టీ ప్రభావితం చేసిందని,అది గమనించిన ఇతర పార్టీలు,ప్రజా సంఘాలు వారి వెంట నడవడానికి నిరాశక్తత చూపిస్తున్నారు.

కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా ఉద్యమాలు నడపాలనే ఉభయ కమ్యూనిస్టు పార్టీల వైఖరిని తప్పు పడుతున్నారు.

ఇదంతా గమనంలో పెట్టుకునే ఉభయ కమ్యూనిస్టు పార్టీలు జేఏసీ సమావేశానికి డుమ్మా కొట్టాయనే చర్చ కూడా జరుగుతున్నది.

లక్షలాదిమంది కుటుంబాలను ఆదుకుంటున్న ఆర్ డి టి ని కాపాడుకోవడమే ఏకైక లక్ష్యం అయితే,పార్టీలు రాజకీయాలు,వ్యక్తిగత అవసరాలు పక్కన పెట్టి, మాజీ ఎంపీ తలారి రంగయ్య గారు చేపట్టిన స్వచ్ఛంద ఉద్యమం లాగా,అందరూ ఏకత్రాటి పైకి రావాల్సి ఉంటుంది,అలా కాకుండా ఒక్కొక్కరు ఒక్కొక్క అజెండాతో ముందుకు వెళ్లడం,సంకుచిత ఆలోచనలకు అద్దం పడుతుంది. ఉద్యమం బలహీనపడుతుంది.

ఇలాంటి పరిస్థితులలో ఉద్యమం ముందుకు వెళ్లాలన్నా,సఫలీకృతం కావాలన్నా ఆర్డిటి యాజమాన్యం,మాంచో ఫెర్రర్ అగ్ర భాగాన నిలబడి ఈ ఉద్యమానికి నాయకత్వం వహిస్తే, ఆర్డిటి సంస్థ పై ఉన్న ఆరోపణలు,అపోహలు,అనుమానాలు, బ్రద్దలు కావడంతో పాటు,ఉద్యమం బలపడి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచి,విజయం సాధించి,లక్షలాదిమంది పేద ప్రజల బ్రతుకులు బజారున పడకుండా,సంస్థ తరలిపోకుండా కాపాడవచ్చు. లేకుంటే ఆర్టిటి సంస్థ కనుమరుగు అయ్యే సమయం ఎంతో దూరం ఉండదు.

**– కేవీ రమణ, రాజకీయ విశ్లేషకులు, అనంతపురం.**



అగ్నిగుండం వెలిగించిన దృశ్యం. అగ్నిగుండ మహోత్సవంలో పాల్గొన్న మాజీ ఎంపీపీ మీనాక్షి రామిరెడ్డి .క్యూలో వెళుతున్న భక్తులు

# ఘనంగా శ్రీ సిద్దేశ్వర స్వామి అగ్నిగుండ మహోత్సవం

**అమరాపురం (తెలుగోడు), ఫిబ్రవరి 17 :**

మండల పరిధిలో హేమావతిలో వెలసిన పురాతన శ్రీ సిద్దేశ్వర స్వామి దేవాలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు సందర్భంగా మంగళవారం అగ్నిగుండ మహోత్సవం కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా శ్రీ సిద్దేశ్వర స్వామికి అర్చకులు త్రికాల పూజలు సుప్రభాత సేవ, రుద్రాభిషేకం, పంచామృత అభిషేకం, పాలాభిషేకం నిర్వహించారు. ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి మేళ తాళాలతో ఆలయ కుడి వైపున అగ్నిగుండం మహోత్సవం దగ్గరికి తీసుకొని వెళ్లి పూజలు నిర్వహించారు. అగ్నిగుండ మహోత్సవాన్ని ఈ.వో. నరసింహారాజు ఉత్సవ కమిటీ అధ్యక్షులు కరే గౌడ ప్రారంభించారు .భక్తులు వేరుశెనగ కాయలు, ఎండిన కొబ్బరి ,ధూపం, నవధాన్యాలు వేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. అగ్నిగుండం మహోత్సవానికి బెంగళూరు, తుంకూర్ ,చిత్రదుర్గ, సిరా, మధుగిరి, పావగడ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ధూపం వేసి వారి వారి మొక్కుబడులను తీర్చుకున్నారు హేమావతి గ్రామం జనంతో కిక్కేసి పోయింది .శ్రీ సిద్దేశ్వర స్వామి అన్నదాసోహం కేంద్రంలో 35, వేల మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు ఆట వస్తువులు తినుబండారాలు, ధూపం, పిల్లల ఆట వస్తువులు తదితర వాటిని అంగళ్ళు వద్ద కొనుగోలుకు రద్దీగా కనిపించింది. భక్తుల కోసం ఆర్టీసీ బస్సులు నడిపారు. భక్తుల రద్దీ దృష్ట్యా స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు బారి క్యాడ్లు ఏర్పాటుచేసి క్యూలో భక్తులను పంపినారు చలివేంద్రం ఏర్పాటు దాతలు శ్రీధర్ రాజప్ప సుబ్బారావు ఈశ్వర్ సహకారంతో మజ్జిగ తాగునీరు పానకం తదితరు వాటిని భక్తులకు అందజేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ సి.ఐ. రాజు కుమార్ ఆధ్వర్యంలో ఎస్సై వలి భాష పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్న సీ.ఐ రాజ్ కుమార్



శ్రీ సిద్దేశ్వర స్వామి పూలతో అలంకరణ
శ్రీ దొడ్డేశ్వర స్వామికి పూలతో అలంకరణ

**పాల్గొన్న మండల కన్వీనర్ కృష్ణమూర్తి..**

హేమావతిలో వెలసిన శ్రీ సిద్దేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవరోజు అగ్నిగుండ మహోత్సవానికి అమరాపురం తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ దేవగానపల్లి కృష్ణమూర్తి, నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు మారుతి ప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, మాజీ ఎంపీపీ మీనాక్షి రామిరెడ్డి, హేమావతి పంచాయితీ కన్వీనర్ కృష్ణమూర్తి, సీనియర్ నాయకుడు రామచంద్ర, మద్దన కుంటప్ప, రవికుమార్, నాగరాజు తదితరులు పాల్గొని శ్రీ సిద్దేశ్వర స్వామి అగ్నిగుండం చుట్టూ ప్రదక్షణలు చేసి ధూపం వేసి మొక్కుబడులు తీర్చుకున్నారు.

**నేడు శ్రీ సిద్దేశ్వర స్వామి సిడిమాను ఉత్సవం.**

బుధవారం సిడిమాను ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షులు కరేగౌడ, ఈవో నరసింహారాజు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కుబడులు తీర్చుకోవాలని వారు కోరారు.



అగ్నిగుండ మహోత్సవంలో పాల్గొన్న మండల కన్వీనర్ కృష్ణమూర్తి నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు మారుతి ప్రసాద్ మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, శ్రీ సిద్ధేశ్వర స్వామి ఉత్సవ కమిటీ అధ్యక్షులు కరే గౌడ, జయ కుమార్, రామచంద్రప్ప

# ఎంటిఎస్ ఉపాధ్యాయులకు చేయూతనిచ్చి ప్రభుత్వం ఆదుకోవాలి

### లోకేష్ గారు ఎంటీఎస్ ఉపాధ్యాయుల గోడు వినిపించుకోండి.. ఎంటిఎస్ ఉపాధ్యాయుల మరణాలతో చిన్నాభిన్నమవుతున్న కుటుంబాలు

**గుడిబండ (తెలుగోడు), ఫిబ్రవరి 17 :**

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మీరైనా రాష్ట్రవ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న ఎంటీఎస్ ఉపాధ్యాయుల గోడు పట్టించుకోండి మహాప్రభో అంటూ పలువురు ఉపాధ్యాయులు కోరుతున్నారు.ఈ మేరకు గుడిబండ మండలంలో ఎంటీఎస్ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న 1998 డీఎస్సీ బ్యాచ్‌కు చెందిన బిటి పల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న రాష్ట్ర ఎం టి ఎస్ యూనియన్ ఉపాధ్యక్షులు వై శంకర్ నాయుడు, తాళికెర గ్రామంలో ఎంటిఎస్ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న ఉమ్మడి అనంతపురం జిల్లా ఎంటిఎస్ ఉపాధ్యక్షులు నాగార్జున, ఉపాధ్యాయులు సునీల్ కుమార్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, బాషా తమ కష్టాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1998 బ్యాచ్‌కు చెందిన బీఈడీలో క్వాలిఫై అయిన కొంతమందిని, అదే విధంగా 2008 బ్యాచ్ కు చెందిన బిఈడి లో క్వాలిఫై అయినా కొంతమందిని అప్పట్లో ఉన్న ప్రభుత్వం ఎం టి ఎస్ ఉపాధ్యాయులుగా నియమిస్తూ తమ జీతాలను 32 వేల రూపాయలకు పరిమితం చేస్తూ అదే విధంగా తమ సర్వీసులను 60 ఏళ్లకే పరిమితం చేసి ఉపాధ్యాయ ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందని. కానీ తమకు మాత్రం రెగ్యులర్ ఉపాధ్యాయులకు కల్పించిన హెచ్ఆర్ఏలు అలివెన్స్ డిఎల్ లను కల్పించకుండా తీవ్ర అన్యాయం చేసిందని అన్నారు. ఇదిలా ఉండగా ఎంటిఎస్ ఉపాధ్యాయులకు సొంత మండలాల్లో విధులు నిర్వహించడానికి అవకాశం కల్పించకుండా దాదాపు 200 నుంచి, 250 కిలోమీటర్ల దూరంలో ఉన్న మండలాలకు బదిలీ చేసి తమను అనేక రకాలుగా ఇబ్బందులు కలిగించడమే గాక రెగ్యులర్ ఉపాధ్యాయులు చేస్తున్న పనిభారాన్ని తమపై వేసి తమకు తక్కువ జీతం ఇస్తూ ప్రభుత్వం వెట్టి చాకిరి చేయించుకుంటూ తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. సుదూర ప్రాంతాల నుంచి విధులు నిర్వహించడానికి వెళుతున్న క్రమంలో చాలామంది ఎం టి ఎస్ ఉపాధ్యాయులు రోడ్డు ప్రమాదాలకు, గుండెపోటుకు గురై మృతి చెందుతున్నారని మరి కొంతమంది ప్రభుత్వం ఇచ్చిన జీతాలతో కుటుంబాలను పోషించుకోలేక తమ వృత్తిని అర్ధాంతరంగా చాలించుకొని తమ ఇళ్లకు వెళుతున్నారని అన్నారు. మృత్యువాత పడ్డ ఎంటి ఎస్ ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఎలాంటి సౌకర్యాలు కల్పించకపోవడంతో ఇంటిలో పెద్ద దిక్కు కోల్పోయిన వారి కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంటిఎస్ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తూ మృతి చెందిన వారి కుటుంబాలను ఆదుకోవడానికి ఎంటీఎస్ ఉపాధ్యాయులు చాలిచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నా తోటి ఉపాధ్యాయులను ఆదుకోవాలనే మానవతా దృక్పథంతో తాము తలో ఇంత చందాలు వేసుకొని మృత్యువాత పడ్డ కుటుంబాలకు ఆర్థిక సహాయం చేస్తున్నట్లు వారు తమ ఆవేదనను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు విన్నవించుకున్నారు. ఇప్పటికే మడకశిర నియోజకవర్గం వ్యాప్తంగా గుడిబండ, అమరాపురం, ఆగలి, రోళ్ళ. మండలాల్లో దాదాపు 250 మంది వరకు ఎంటిఎస్ ఉపాధ్యాయులే వివిధ పాఠశాలలో పనిచేస్తున్నారన్నారు. వారు చాలీచాలని వేతనాలతో పుట్టపర్తి, కదిరి, ధర్మవరం తదితర పట్టణాల నుంచి వచ్చి విధులు నిర్వహిస్తున్నారని ఎంటీఎస్ ఉపాధ్యాయులు సొంత మండలాల్లోనే విధులు నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులను ఇప్పటికైనా ప్రభుత్వం ఎంటీఎస్ ఉపాధ్యాయుల గోడును వినిపించుకుని వారు పడే కష్టాలను గుర్తించి వారికి రెగ్యులర్ ఉపాధ్యాయులకు కల్పించిన హెచ్ఆర్ఏ డిఏ అలవెన్స్ సౌకర్యాలను కల్పించడమే గాక 60 ఏళ్లకే కుదించి న తమ సర్వీస్ ను 62 ఏళ్లకు పెంచాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ , ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.



రాష్ట్ర ఎంటిఎస్ యూనియన్ ఉపాధ్యక్షులు వై శంకర్ నాయుడు, ఉమ్మడి అనంతపురం జిల్లా ఎం టి ఎస్ యూనియన్ ఉపాధ్యక్షులు నాగార్జున

# అగ్నిగుండ మహోత్సవంలో పాల్గొన్న హల్యాకర్ కాంతరాజు

**అమరాపురం (తెలుగోడు), ఫిబ్రవరి 17 :**

హేమావతిలో వెలసిన శ్రీ సిద్దేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం అగ్నిగుండ మహోత్సవానికి వైఎస్ఆర్సిపి రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు హల్యాకర్ కాంతారావు పాల్గొన్నారు. శ్రీ సిద్దేశ్వర స్వామి కి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అగ్నిగుండం చుట్టూ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు హల్యాకర్ కాంతారావు మూడుసార్లు ప్రదక్షిణలు చేసి ధూపం వేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులకు మజ్జిగ ,పానకం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మండల్ కన్వీనర్ త్రిలోక్నాథ్ , ఎంపీటీసీ హనుమంతరాయ, సర్పంచ్ తిప్పేస్వామి మాజీ ఆలయ కమిటీ చైర్మన్ మంజునాథ్ హల్యాకర్ సురేష్, పులి కుంట కాంత రాజు తదితరులు పాల్గొన్నారు.



మజ్జిగ , పానకం అందజేస్తున్న వైఎస్ఆర్సిపి రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు హల్యాకర్ కాంతా రాజు



శ్రీ సిద్దేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వైఎస్ఆర్సిపి రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు హల్యాకర్ కాంతా రాజు
అగ్నిగుండ మహోత్సవంలో పాల్గొన్న రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు హల్యాకర్ కాంతరాజు, మండల్ కన్వీనర్ త్రిలోక్నాథ్

## వైభవంగా జంపన్న తాత రథోత్సవం

డి హిరేహాల్ (తెలుగోడు )ఫిబ్రవరి 17

డి హీరేహాల్ మండలం పరిధిలోని పులకుర్తి గ్రామంలో వెలసిన జంబన్న తాత స్వామి వారి రథోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. జంబన్న తాత ఆలయంలో ఉదయం నుండే ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా గ్రామ పరిసర గ్రామాలతో పాటు కర్ణాటక ప్రాంతానికి చెందిన వేలాదిమంది భక్తులు తరలివచ్చి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం జంబన్న తాత స్వామి వారి రథోత్సవం కన్నులకు పండుగగా జరిగింది. రథోత్సవం సందర్భంగా గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రాయదుర్గం రూరల్ ఇన్స్పెక్టర్ కె వెంకటరమణ స్థానిక ఎస్సై గురు ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



జంబన్న తాత రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

# స్టార్‌గా ఎదగడం మామూలు విషయం కాదు

సినిమా ఇండస్ట్రీలో బ్యాక్‌గ్రౌండ్ లేకుండా వచ్చి స్టార్‌గా ఎదగడం అంటే చిన్న విషయం కాదు. అందులోను ముఖ్యంగా హీరోయిన్ లకు.. ఎంత అందంగా ఉన్నప్పటికి స్టార్ డమ్ సంపాదించుకోవాలి అంటే తిప్పలు పడాల్సిందే. కొంత మందికి అదృష్టం బాగుండి అవకాశాలు వస్తాయి అందులో మృణాల్ ఠాకూర్ ఒకరు. తన అందం, అభినయంతో సౌత్ నార్త్ ప్రేక్షకులను మాయ చేస్తున్న ఈ ముద్దుగుమ్మ, ప్రస్తుతం ఆమె నటించిన లేటెస్ట్ మూవీ 'దో దీవానే షెహర్ మే' విడుదల సిద్ధంగా ఉంది. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా మృణాల్ తన కెరీర్ తొలినాళ్లలో పడ్డ కష్టాలను పంచుకుంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.మంచి పాత్రల కోసం దర్శకుల వెంట పడటంలో ఏమాత్రం తప్పు లేదని మృణాల్ స్పష్టం చేశారు.. 'మనం ఒక పాత్ర కోసం ఎంత ఆకలితో ఉన్నామో తెలిస్తేనే దర్శకుల ఆలోచనా విధానం మారుతుంది' అని ఆమె అభిప్రాయపడ్డారు. తన తాజా చిత్రం 'దో దీవానే షెహర్ మే' అవకాశం కూడా అలానే వచ్చిందని ఆమె వెల్లడించారు. దర్శకుడు రవి ఉద్యావర్ తెరకెక్కించిన 'మామ్' సినిమా చూసి ఫిదా అయిపోయిన మృణాల్, నేరుగా ఆయన్ని కలిసి.. 'సర్, మనం సినిమా ఎప్పుడు చేస్తున్నాం?' అని అడిగేశారట. ఆమెలోని ఆ ధైర్యమే నేడు ఈ భారీ ప్రాజెక్టులో అవకాశం తెచ్చిపెట్టింది. గతాన్ని గుర్తుచేసుకుంటూ.. 'మొదట్లో నాకు పని ఎలా అడగాలో కూడా తెలియదు. 'ధురంధర్' డైరెక్టర్ ఆదిత్య ధర్ గారినే నేను మొదటిసారి అవకాశం అడిగాను. ఒక అవుట్‌సైడర్‌గా నా ముఖం వాళ్లకు కనిపించేలా చేసుకోవడానికి 'సర్, నేను ఇక్కడే ఉన్నాను.. నన్ను ఒకసారి కాస్ట్ చేయండి' అని బతిమిలాడేదాన్ని' అంటూ మృణాల్ ఎమోషనల్ అయ్యారు. సిద్ధాంత్ చతుర్వేదితో కలిసి ఆమె నటించిన ఈ రొమాంటిక్ డ్రామా ఫిబ్రవరి 20న థియేటర్లలోకి రానుంది. అరేంజ్డ్ మ్యారేజ్ నేపథ్యంలో సాగే ఈ కథ ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని మృణాల్ ధీమా వ్యక్తం చేస్తున్నారు.



# వారణాసిలో శివ భక్తుడిగా కనిపిస్తా.. ప్రకాశ్‌రాజ్



భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి'పై రోజురోజుకూ ఆసక్తి పెరుగుతోంది. సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా, దర్శకధీరుడు ఎస్. ఎస్. రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం పాన్ వరల్డ్ స్థాయిలో విడుదలకు సిద్ధమవుతోంది. ఇప్పటి వరకు సినిమా విషయాలపై గోప్యత పాటించిన రాజమౌళి, ఇటీవల ఒక్కో అప్డేట్‌ను బయట పెడుతూ అభిమానుల్లో హైప్‌ను మరింత పెంచుతున్నారు. ఈ సినిమాలో మహేష్ బాబు 'రుద్ర' అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనుండగా, బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ప్రియాంక చోప్రా 'మందాకిని' పాత్రలో నటిస్తోంది. మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ 'కుంభ' పాత్రలో కనిపించనున్నాడు. ఈ ముగ్గురు ప్రధాన పాత్రల ఫస్ట్ లుక్స్‌ను ఇప్పటికే చిత్రబృందం విడుదల చేయగా, టైటిల్ టీజర్ ద్వారా 'వారణాసి వరల్డ్' ఎలా ఉండబోతుందో ఒక విజువల్ శాంపిల్‌ను చూపించారు. ఓ హాలీవుడ్ ఇంటర్వ్యూలో రాజమౌళి సినిమా జానర్, కథ నేపథ్యంపై స్వల్ప హింట్స్ కూడా ఇచ్చారు. ఇదిలా ఉండగా, ఈ చిత్రంలో రామాయణానికి సంబంధించిన ఓ ఎపిసోడ్ కూడా ఉండబోతుందని రాజమౌళి స్వయంగా వెల్లడించారు. కొన్ని నిమిషాల పాటు మహేష్ బాబు శ్రీరాముడి పాత్రలో కనిపించనున్నట్లు తెలిపారు. ఆ ఎపిసోడ్ షూటింగ్ ఇప్పటికే పూర్తయ్యిందని, ప్రస్తుతం వీఎఫ్ఎక్స్ పనులు జరుగుతున్నాయని సమాచారం. ఈ అంశం సినిమా మీద అంచనాలను మరింత పెంచింది. ఇక తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన మరో ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ ఈ సినిమాలో నటిస్తున్న విషయం కొంతకాలం క్రితమే వెల్లడించగా, ఇప్పుడు తన పాత్రను కూడా స్వయంగా బయటపెట్టారు. ఇటీవల ఓ న్యూస్ ఛానల్ డిబేట్‌లో పాల్గొన్న ఆయన, 'వారణాసి' చిత్రంలో తాను మహా శివభక్తుడి పాత్ర పోషిస్తున్నానని తెలిపారు. ఈ పాత్ర తన నటనా జీవితంలో మరో ప్రత్యేకమైన మైలురాయిగా నిలుస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రకాశ్ రాజ్ గతంలో రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన 'విక్రమార్కుడు' చిత్రంలో నటించారు. అలాగే మహేష్ బాబుతో 'రాజకుమారుడు' నుంచి 'గుంటూరు కారం' వరకు అనేక హిట్ చిత్రాల్లో కలిసి నటించారు. వీరిద్దరి కాంబినేషన్‌కు ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన ఆదరణ ఉంది. గతంలో 'ఢమరుకం' చిత్రంలో శివుడి పాత్రలో కనిపించిన ప్రకాశ్ రాజ్, ఇప్పుడు శివభక్తుడిగా నటించడం విశేషం. ప్రస్తుతం 'వారణాసి' తదుపరి షెడ్యూల్‌కు చిత్రబృందం సిద్ధమవుతోంది. విజువల్ గ్రాండియర్, మైథాలజీ ఎలిమెంట్స్, యాక్షన్ అడ్వెంచర్ మేళవింపుతో రూపొందుతున్న ఈ చిత్రం వచ్చే ఏడాది సమ్మర్ సీజన్‌లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. అభిమానులు మాత్రం ఈ సినిమాను భారతీయ సినిమా గర్వంగా నిలిచే ప్రాజెక్ట్‌గా భావిస్తూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# దురంధర్ 2 కి ఆటంకం



ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోన్న 'ధురంధర్ 2' చిక్కుల్లో పడింది. ఈ సినిమా నిర్మాణ సంస్థ ముంబయిలో షూటింగ్ చేసుకోవడానికి వీల్లేదని దీనిపై బ్యాన్ విధించాలని బృహన్ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ బ్యాన్ ప్రభావం షూటింగ్‌పై పడనుంది. ముంబయిలో చిత్రీకరణకు అనుమతి ఇవ్వాలని నిర్మాణ సంస్థ అప్లై చేసుకోగా.. దానికి మున్సిపల్ కార్పొరేషన్ అనుమతులు ఇవ్వలేదు. అంతేకాకుండా దీనిపై శాశ్వతంగా బ్యాన్ విధించాలని ప్రభుత్వాన్ని కోరింది. గతంలో షూటింగ్ నిర్వహించిన సమయంలో టీమ్ నిబంధనలను ఉల్లంఘించిందని అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కార్పొరేషన్ వెల్లడించింది. ముంబయిలోని పలు వీధుల్లో ఇటీవల దీని షూటింగ్ జరిగిందని ఆ సమయంలో క్రాకర్లు, మండే పదార్థాలు ఉపయోగించారని అది షరతులను ఉల్లంఘించినట్లేనని అధికారులు పేర్కొన్నారు. ఆదిత్యధర్ దర్శకత్వంలో రణ్‌వీర్ సింగ్ హీరోగా వచ్చిన చిత్రం 'ధురంధర్'. గతేడాది చివర్లో విడుదలై సూపర్ హిట్‌ను సొంతం చేసుకుంది. దీనికి సీక్వెల్‌గా 'ధురంధర్:ది రివెంజ్' రానుంది. మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

# సెలెక్టివ్‌గా సినిమాలు చేస్తున్నా.. శివాని



'ఇది సుహాస్‌తో నా రెండో సినిమా. కెరీర్‌లో నా మూడో సినిమా. ఇంతకు ముందు చేసిన సినిమాలో ఇంటెన్స్ క్యారెక్టర్ చేశాను. ఇందులో లైటర్ వెయిన్‌లో సాగే ఎంటర్‌టైన్‌మెంట్ పాత్ర. ఎంజాయ్‌చేస్తూ ఈ పాత్ర చేశా. వినోదంతోపాటు ఇందులో ఫాదర్ అండ్ సన్ ఎమోషన్ కూడా బావుంటుంది' అని శివాని నగరం అన్నారు. సుహాస్‌కి జోడీగా ఆమె నటించిన చిత్రం 'హే బలవంత్'. 'హే భగవాన్' అనే టైటిల్‌తో రూపొందిన ఈ సినిమాను కొన్ని కారణాల దృష్ట్యా 'హే బలవంత్'గా మార్చారు. గోపీ అచ్చర దర్శకుడు. బి.నరేంద్రరెడ్డి నిర్మాత. బన్నీవాస్, వంశీ నందిపాటి ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ఈ నెల 20న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో శివాని నగరం విలేకరులతో ముచ్చటించింది. 'వినగానే నచ్చిన కథ ఇది. వినోదంతోపాటు కలర్‌ఫుల్ విజువల్స్, మంచి మ్యూజిక్ కూడా ఇందులో ఉంది. నా పాత్ర, సుహాస్ పాత్ర, నరేష్, వెన్నెల కిశోర్ ఇలా అన్ని పాత్రలూ మిమ్మల్ని నవ్విస్తాయి. సుహాస్ మంచి నటుడు, ఫ్రెండ్లీ కూడా. ఇందులో మా కాంబినేషన్ సీన్స్‌ని ఆడియన్స్ ఎంజాయ్ చేస్తారు' అని చెప్పారు. తెలుగు మాత్రమే కాక, ఇతర భాషల నుంచి కూడా అవకాశాలు వస్తున్నాయని, సెలక్టీవ్‌గా సినిమాలు చేస్తున్నాననీ, తమిళంలో రెండు సినిమాలు నిర్మాణ దశలో ఉన్నాయని, తెలుగులో రెండు సినిమాలు చర్చల దశలో ఉన్నాయని శివాని నగరం తెలిపారు.

# సేయూన్‌తో వస్తున్న శివకార్తికేయన్




కోలీవుడ్ సెన్సేషనల్ స్టార్ శివకార్తికేయన్ తన 26వ సినిమా అప్‌డేట్‌తో సోషల్ మీడియాను షేక్ చేస్తున్నారు. గతేడాది 'అమరన్' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకున్న శివకార్తికేయన్- కమల్ హాసన్ కాంబో, ఇప్పుడు 'సేయోన్' అనే పవర్‌ఫుల్ ప్రాజెక్ట్‌తో మళ్ళీ ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఫిబ్రవరి 16న ఈ చిత్ర టైటిల్‌తో ఫస్ట్ లుక్‌ను విడుదల చేసిన మేకర్స్ తాజాగా ఫస్ట్ గ్లింప్స్‌ను వదిలారు. ఫస్ట్ గ్లింప్స్‌లో శివకార్తికేయన్ సాంప్రదాయ ధోతీ, విభూతి మరియు రుద్రాక్షలతో కనిపిస్తూనే, చేతిలో కాగడా పట్టుకుని ఊగిపోతున్నట్లు కనిపిస్తున్నాడు. శివకార్తికేయన్ పాత్ర చూస్తుంటే.. ఈ సినిమా తమిళ దేవుడు మురుగన్ (సుబ్రహ్మణ్య స్వామి) అంశతో ముడిపడి ఉన్నట్లు తెలుస్తోంది. 'సేయోన్' అంటే రాజు అని అర్థం. మురుగన్‌ని తమిళంలో 'సేయోన్' అని కూడా పిలుస్తారు. లోకనాయకుడు కమల్ హాసన్ తన సొంత బ్యానర్ 'రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్' పై ఆర్. మహేంద్రన్ తో కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'అమరన్' వంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత వీరు కలిసి చేస్తున్న రెండో సినిమా కావడంతో ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రానికి శివకుమార్ మురుగేశన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆయన మొదటి చిత్రం 'తాయ్ కిళవి' విడుదలకు ముందే శివకార్తికేయన్ ఆయన ప్రతిభను గుర్తించి ఈ భారీ అవకాశం ఇచ్చినట్లు సమాచారం.

# సల్మాన్ హుటాహుటిన ఆసుపత్రికి



బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్ తండ్రి సలీం ఖాన్(90) అనారోగ్యంతో ముంబైలోని లీలావతి ఆస్పత్రిలో చేరారు. మంగళవారం ఉదయం ఆయనకు స్వల్ప అస్వస్థత కలగడంతో కుటుంబ సభ్యులు వెంటనే బాంద్రాలోని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన వయస్సు 90 ఏళ్లు కావడంతో వైద్యులు ముందు జాగ్రత్త చర్యగా ఆయనను ఐసీయూ విభాగంలో ఉంచి పర్యవేక్షిస్తున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆస్పత్రి వర్గాల నుంచి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.సలీం ఖాన్ ఆసుపత్రిలో చేరిన విషయం తెలియగానే సల్మాన్ ఖాన్ తన షూటింగ్ పనులను పక్కన పెట్టి హుటాహుటిన లీలావతి ఆసుపత్రికి చేరుకున్నారు. సుమారు గంటకు పైగా అక్కడే ఉండి వైద్యులతో తండ్రి చికిత్స గురించి చర్చించారు. సల్మాన్ మాత్రమే కాకుండా ఆయన సోదరి అల్విరా ఖాన్, బావ అతుల్ అగ్నిహోత్రి, మనవడు అయాన్ అగ్నిహోత్రి, ఆయుష్ శర్మ కూడా ఆసుపత్రికి చేరుకున్నారు. కుటుంబ సభ్యులంతా అక్కడే ఉండి సలీం ఖాన్ ఆరోగ్యం గురించి ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు.

Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu… EDITOR- B.SHANKAR PRASAAD .. PRGI No- APTEL/25/A2739, Cell- 9963496956, 7382712780.